


www.hamsakalam.com

PRGI: TGTEL/26/A3129

సంచలన తెలుగు దినపత్రిక

# హంస కలం వార్త

HAMSA KALAM VARTA

చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి





EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:86 TUESDAY , AUGUST 11, 2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 86 మంగళవారం 11 ఆగష్టు 2026 పేజీలు :8 వెల: 4/-


## ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు

### పెద్ది సుదర్శన్ రెడ్డి



**దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డికి కేటీఆర్ నివాళి**

**పెద్ది కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ**

**ప్రజల హృదయాల్లో పెద్ది చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడిన కేటీఆర్**

హంసకలం వార్త : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత పెద్ది సుదర్శ న్ రెడ్డికి ఘనంగా నివాళులర్పిం చారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో సోమవారం నిర్వహి ంచిన సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సంపేటలో 2లో

## వర్షాల కోసం వరుణయాగం

**తెలంగాణలో వర్షాల కోసం ప్రభుత్వం మహా వరుణ యాగం**

**నాగార్జున సాగర్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతుల పూజలు**

**ఎల్ నినో ప్రభావం, తగ్గిన జలమట్టాల నేపథ్యంలో ప్రత్యేక క్రతువు**

**యాదగిరిగుట్ట పండితుల ఆధ్వర్యంలో 11 హోమగుండాలతో యాగం**





హంసకలం వార్త :రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, జలాశయాలు జలకళను సంతరించుకోవాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం సోమవారం 'మహా వరుణ యాగం' నిర్వహించింది. నాగార్జున సాగర్ సమీపంలోని కృష్ణా తీరంలో ఉన్న విజ య విహార్ వేదికగా ఈ క్రతువును శాస్త్రోక్తంగా జరిపించారు. యాగం ముగింపు సందర్భంగా నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ ఏడాది రుతుపవనాలు బలహీనంగా మిగతా2లో



## పొంగులేటి వర్సెస్ కౌశిక్‌రెడ్డి

### డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో రగడ

- హన్మకొండ జిల్లా కమలాపూర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో ఉద్రిక్తత
- మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్‌తో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వాగ్వాదం
- గత ప్రభుత్వంపై విమర్శలు చేయడంతో వేదికపైనే అభ్యంతరం తెలిపిన ఎమ్మెల్యే
- ప్రభుత్వ వేదికపై రాజకీయాలు వద్దంటూ మంత్రులకు హితవు
- ఇరువర్గాల నినాదాలతో జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దిన పోలీసులు

హంసకలం వార్త :హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలంలో సోమవారం నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. మంత్రుల ప్రసంగాలపై స్థానిక హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయడంతో మిగతా2లో

## తెలంగాణలో ముగిసిన సర్ ప్రక్రియ..




హంసకలం వార్త: తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్యూమరేషన్ ప్రక్రియ ముగిసింది. రాష్ట్ర ంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్న ట్లు అధికారులు తేల్చారు. తెలంగాణలో 73,95, 954 మంది ఓటర్లను తొలగించినట్లు సమాచారం. ఇప్పటివరకు 2,64,30,494 మిగతా2లో



## చురుకుగా యంగ్ ఇండియా స్కూల్ పనులు

**పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు**

**పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం**

హంసకలం వార్త :

కొల్లాపూర్ నియోజకవర్గం పెంట్ల వెల్లి మండలం జటప్రోలులో నిర్మి స్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రే టెడ్ స్కూల్ పనులను పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం పరిశీలించారు.



## కోటి మందికిపైగా స్మార్ట్ రేషన్‌కార్డులు ఇవ్వబోతున్నాం

హంసకలం వార్త : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 15న జిల్లాలో పర్యటించనున్నారు. సంగారెడ్డిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డులను సీఎం పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా సోమవారం తారా డిగ్రీ కాలేజీలో హెలిప్యాడ్, అంబేద్కర్ స్టేడియంలో సభా స్థలిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, మిగతా2లో

## హైదరాబాద్ వాసులకు గుడ్‌న్యూస్

**హైదరాబాద్‌లో జనన, మరణాల నమోదుకు కొత్త ఆన్‌లైన్ పోర్టల్** 2

**కొత్త పోర్టల్‌పై అధికారులతో జీహెచ్ఎంసీ కమిషనర్ సమీక్ష**

**కఠినంగా మారిన జనన, మరణాల నమోదు సవరణ చట్టం-2026**

జనన, మరణ ధ్రువపత్రాల జారీలో జాప్యాన్ని నివారించి, ఆ ప్రక్రియను మరింత సరళతరం చేసేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) సిద్ధమవుతోంది.

## 'టీజీ-వీర్' ఆవిష్కరణ



### అమరవీరుల కుటుంబాలకు అండగా తెలంగాణ పోలీస్

- పోర్టల్‌నుఆవిష్కరించిన డీజీపీ సీవీ ఆనంద్
- ఆర్థిక సాయం, ఉద్యోగాలు, ప్లాట్ల సమస్యలపై ఫిర్యాదు చేసే అవకాశం
- వరంగల్‌లో 28 మంది అమరవీరుల కుటుంబాలతో డీజీపీ భేటీ
- పోర్టల్‌ను యాక్సెస్ చేసేందుకు క్యూఆర్ కోడ్ కార్డుల జారీ

హంసకలం వార్త : విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల కుటుంబాలకు భరోసా కల్పించే దిశగా తెలంగాణ రాష్ట్ర పోలీసు విభాగం కీలక నిర్ణయం తీసుకుంది. వారి సమస్యల తక్షణ పరిష్కారం కోసం 'టీజీ-వీర్' పేరుతో ప్రత్యేక గ్రీవెన్స్ పోర్టల్‌ను డీజీపీ సీవీ ఆనంద్ ఆదివారం ప్రారంభించారు. ఈ పోర్టల్ ద్వారా అమరవీరుల కుటుంబాలు తమకు అందాల్సిన ఆర్థిక సాయం, కారుణ్య నియామకాలు, నివేశన స్థలాల కేటాయింపు సహా ఇతర ప్రయోజనాలపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. అమరవీరుడి మిగతా2లో



## 'హర్ ఘర్ తిరంగా' అభియాన్‌లో ప్రతి భారతీయుడు భాగస్వామి కావాలి 2

## బండి సంజయ్ బతుకంతా మత రాజకీయమే



**బోనాల పండుగలను బీజేపీ నేతలు రాజకీయాలకు వాడుకుంటున్నారన్న ఆది శ్రీనివాస్**

**కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందని వ్యాఖ్య**

**మహంకాళి అమ్మవారికి రేవంత్ రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారన్న శ్రీనివాస్**

హంసకలం వార్త : కేంద్ర మంత్రి బండి సంజయ్ బతుకంతా మతం పేరు చెప్పుకుని రాజకీయం చేయడమేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్రస్థాయిలో విమర్శించారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను కూడా బీజేపీ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం సరికా దని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా బోనాల పండుగను ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహించిందని, సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారిని దర్శించుకుని పట్టు మిగతా2లో

# వర్షాల కోసం వరుణ యాగం..



రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, జలాశయాలు జలకళను సంతరించుకోవాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం సోమవారం 'మహా వరుణ యాగం' నిర్వహించింది. నాగార్జున సాగర్ సమీపంలోని కృష్ణా తీరంలో ఉన్న విజయ విహార్ వేదికగా ఈ క్రతువును శాస్త్రోక్తంగా జరిపించారు. యాగం ముగింపు సందర్భంగా నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ ఏడాది రుతుపవనాలు బలహీనంగా ఉండటం, ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ప్రభుత్వం ఈ యాగానికి శ్రీకారం చుట్టింది. ఉదయం నుంచి సాగిన ఈ క్రతువులో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు కూడా పాల్గొన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన 108 మంది రుత్విక్కులు, వేద పండితుల పర్యవేక్షణలో 11 హోమ గుండాలతో ఈ యాగాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రస్తుతం నాగార్జున సాగర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.045 టీఎంసీలు కాగా, కేవలం 145.65 టీఎంసీల మేర మాత్రమే నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం ఇది సుమారు 518 అడుగుల వద్దే కొనసాగుతోంది. గత ఏడాది ఇదే సమయానికి జలాశయం నిండుకుండలా ఉందని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి, కృష్ణా, గోదావరి నదులు పరవళ్లు తొక్కాలని, చెరువులు నిండి అన్నదాతల పంటలు పచ్చగా ఉండాలన్న సంకల్పంతో ఈ యాగం నిర్వహించినట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది.

# చురుకుగా యంగ్ ఇండియా స్కూల్ పనులు



కొల్లాపూర్ నియోజకవర్గం పెంట్లవెల్లి మండలం జటప్రోలులో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో రాజీపడకుండా నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు.

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం**

రాష్ట్రంలోని అన్ని వర్గాల పిల్లలకు సమానంగా నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోందని మంత్రి తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు.విద్యతోపాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన ఆధునిక వసతులు, ప్రయోగశాలలు, క్రీడా సదుపాయాలతో ఈ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో బాలురు, బాలికలకు ప్రత్యేకంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ విజన్ అని తెలిపారు. విద్యారంగాన్ని బలోపేతం చేయడం ద్వారా తెలంగాణ విద్యార్థులను భవిష్యత్ పోటీ ప్రపంచానికి సిద్ధం చేయాలని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జటప్రోలు పాఠశాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటు లోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

# అమరవీరుల కుటుంబాలకు అండగా తెలంగాణ పోలీస్..

విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల కుటుంబాలకు భరోసా కల్పించే దిశగా తెలంగాణ రాష్ట్ర పోలీసు విభాగం కీలక నిర్ణయం తీసుకుంది. వారి సమస్యల తక్షణ పరిష్కారం కోసం 'టీజీ-వీర్' పేరుతో ప్రత్యేక గ్రీవెన్స్ పోర్టల్‌ను డీజీపీ సీవీ ఆనంద్ ఆదివారం ప్రారంభించారు. ఈ పోర్టల్ ద్వారా అమరవీరుల కుటుంబాలు తమకు అందాల్సిన ఆర్థిక సాయం, కారుణ్య నియామకాలు, నివేశన స్థలాల కేటాయింపు సహా ఇతర ప్రయోజనాలపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. అమరవీరుడి సర్వీసు వివరాలు, కుటుంబ సభ్యుల సమాచారం, అందిన ప్రయోజనాలు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులన్నీ ఒకేచోట లభ్యమవుతాయి. యూనిట్, రాష్ట్ర స్థాయిల్లోని ఉన్నతాధికారులు ఈ ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటారు. జిల్లాల పర్యటనలో భాగంగా రెండో రోజు వరంగల్‌కు చేరుకున్న డీజీపీ సీవీ ఆనంద్.. మావోయిస్టుల పోరాటంలో అసువులు బాసిన 28 మంది పోలీసు కుటుంబ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారికి క్యూఆర్ కోడ్ ఆధారిత ఫ్యామిలీ కార్డులను పంపిణీ చేశారు. ఈ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా నేరుగా 'టీజీ-వీర్' పోర్టల్‌ను యాక్సెస్ చేయవచ్చు. ఎక్స్‌గ్రేషియా, ఆర్థిక సాయం, పెన్షన్ వంటి ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పలు కుటుంబాలు డీజీపీ దృష్టికి తీసుకెళ్లగా, వాటిని ప్రభుత్వంతో చర్చించి పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అమరవీరుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్‌ను డీజీపీ ఆదేశించారు. నక్సల్స్ ఉద్యమం ఉద్ధృతంగా ఉన్న కాలంలో తాను వరంగల్‌లోనే వృత్తి జీవితాన్ని ప్రారంభించానని ఈ సందర్భంగా డీజీపీ గుర్తుచేసుకున్నారు. ఎందరో పోలీసుల ప్రాణత్యాగాల పునాదులపైనే ఈ ప్రాంతంలో నేడు శాంతి నెలకొందని ఆయన పేర్కొన్నారు. అనంతరం, నిర్మాణ దశలో ఉన్న వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన భవనాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

## 'హర్ ఘర్ తిరంగా' అభియాన్‌లో ప్రతి భారతీయుడు భాగస్వామి కావాలి

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సూచించారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ కార్యక్రమాన్ని రాష్ట్రమంతా విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా బీజేపీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. 'హర్ ఘర్ తిరంగా అభియాన్' కార్యక్రమాన్ని పురస్కరించుకుని బండి సంజయ్ హైదరాబాద్‌లోని తన నివాసం వద్ద జాతీయ జెండాను సోమవారం ఎగురవేశారు. అనంతరం పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనేందుకు ఆయన ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మీడియాకు బండి సంజయ్ ఒక ప్రకటన విడుదల చేశారు.

**'తిరంగా యాత్ర'లను విజయవంతంగా నిర్వహించాలి..**

దేశవ్యాప్తంగా 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ కార్యక్రమాలను చేపడుతున్నట్లు బండి సంజయ్ వ్యాఖ్యానించారు. ఈరోజు నుంచి 'హర్ ఘర్ తిరంగా అభియాన్' కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో 'తిరంగా యాత్ర'లను విజయవంతంగా నిర్వహించాలని బీజేపీ శ్రేణులను బండి సంజయ్ కోరారు. కుల, మత, వర్గాలకు అతీతంగా ప్రతి భారతీయుడు, విద్యార్థులు పెద్దఎత్తున భాగస్వామ్యమై స్వచ్ఛందంగా తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశంపై తమకున్న భక్తిభావాన్ని చాటుకోవడానికి ఇది సువర్ణావకాశమని పేర్కొన్నారు.

**స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను శుద్ధి చేయాలి..**

స్వాతంత్ర్య దినోత్సవానికి ముందుగా, ఆగస్టు 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు మహాపురుషులు, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను శుద్ధి చేసి, స్మారక చిహ్నాల చుట్టూ ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ శ్రేణులను బండి సంజయ్ కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో, ప్రతి కూడలిలో తిరంగా ర్యాలీలు, దేశభక్తి ప్రదర్శనలు, ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రతి పౌరుడిని మానసికంగా దేశంతో అనుసంధానించే ఒక గొప్ప సామాజిక ఉద్యమంగా ఈ కార్యక్రమం రూపాంతరం చెందిందని తెలిపారు. ప్రతి ఏడాది ఇది ఘనంగా జరుగుతోందని గుర్తుచేశారు. 'మన జాతీయ త్రివర్ణ పతాకం దేశ ప్రజలందరి ఐక్యతకు, సమైక్యతకు, అఖండతకు ప్రతీక అని వెల్లడించారు. ప్రతి ఇంటా దేశభక్తి వాతావరణం పరిమళించేలా ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా చూసి 'హర్ ఘర్ తిరంగా' అభియాన్‌ను విజయవంతం చేయాలని బండి సంజయ్ కోరారు.

# హైదరాబాద్ వాసులకు గుడ్‌న్యూస్

జనన, మరణ ధ్రువపత్రాల జారీలో జాప్యాన్ని నివారించి, ఆ ప్రక్రియను మరింత సరళతరం చేసేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) సిద్ధమవుతోంది. నగరవా సుల సౌకర్యార్థం 'సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్' (సీఆర్ఎస్) పేరుతో సరికొత్త ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తోంది. దీని ద్వారా ప్రజలు ఆన్‌లైన్‌లోనే జనన, మరణాలను సులువుగా నమోదు చేసుకుని, వేగంగా ధ్రువపత్రాలను పొందే వీలుంటుంది. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఇటీవల అధికారులతో ఈ అంశంపై సమీక్ష నిర్వహించారు. జనన, మరణాల నమోదు, సకాలంలో ధ్రువపత్రాల జారీ అనేది జీహెచ్ఎంసీ ప్రాథమిక బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. రాబోయే కొత్త పోర్టల్ పనితీరుతో పాటు జనన, మరణాల నమోదు చట్టంపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ నూతన డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల పార్లమెంట్ ఆమోదించి, రాష్ట్రపతి సంతకంతో అమల్లోకి వచ్చిన జనన, మరణాల నమోదు (సవరణ) చట్టం-2026 నేపథ్యంలో జీహెచ్ఎంసీ తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. నూతన చట్టం ప్రకారం, జనన లేదా మరణాల నమోదులో జాప్యం జరిగితే కఠినమైన నిబంధనలు వర్తిస్తాయి. ఒకటి నుంచి రెండేళ్లలోపు జాప్యం జరిగితే జిల్లా మేజిస్ట్రేట్ లేదా సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ నుంచి అనుమతి పొందడం తప్పనిసరి. ఒకవేళ రెండేళ్లు దాటితే మాత్రం ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నుంచి మాత్రమే ఉత్తర్వులు పొందాల్సి ఉంటుంది. ఈ కఠిన నిబంధనల దృష్ట్యా, పౌరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చూడటంలో జీహెచ్ఎంసీ ప్రవేశపెట్టనున్న 'సీఆర్ఎస్' పోర్టల్ కీలక పాత్ర పోషించనుంది.

## మంత్రి పొంగులేటి వర్సెస్ పాడి కౌశిక్ రెడ్డి

హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలంలో సోమవారం నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. మంత్రుల ప్రసంగాలపై స్థానిక హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరుపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవంతో పాటు, లబ్ధిదారులకు పట్టాల పంపిణీ నిమిత్తం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వం పనులను అసంపూర్తిగా వదిలేసిందని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించి పనులను పూర్తి చేసి, లబ్ధిదారులకు ఇళ్లను అందిస్తోందని వారు పేర్కొన్నారు. మంత్రుల వ్యాఖ్యలపై అదే వేదికపై ఉన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తక్షణమే స్పందించారు. ఈ ఇళ్లను నిర్మించింది కేసీఆర్ ప్రభుత్వమని, మంత్రులు వాస్తవ విరుద్ధమైన ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "అబద్ధాలు చెప్పవద్దు.. కేవలం నిజాలే మాట్లాడండి. ఇది రాజకీయాలు చేసే వేదిక కాదు, ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన చోటు" అని ఆయన పేర్కొన్నారు. అధికారిక ప్రభుత్వ కార్యక్రమంలో రాజకీయ విమర్శలు చేయడం సరికాదని మంత్రులపై ఆగ్రహం వెలిబుచ్చారు. ఈ క్రమంలో ఇరు పార్టీల కార్యకర్తలు, మద్దతుదారులు పరస్పరం నినాదాలు చేసుకోవడంతో అక్కడ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని, పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలను అక్కడి నుంచి పంపించి వేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## తెలంగాణలో ముగిసిన సర్ ప్రక్రియ..

ఇప్పటివరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం డిజిటలైజేషన్ నమోదైంది. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 94.30 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. ఆ తర్వాతి స్థానాల్లో మెదక్ 90.54 శాతం, సూర్యాపేట 90.43 శాతంతో ఉన్నాయి. ఇక, హైదరాబాద్ 27,74,687 ఎన్యూమరేషన్ ఫారాలతో 58.58 శాతం డిజిటలైజేషన్ పూర్తై చివరి స్థానంలో నిలిచింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 63.82 శాతం, రంగారెడ్డి జిల్లాలో 64.91 శాతం, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 89.45 శాతం, జగిత్యాల జిల్లాలో 89.60 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. రెండు సార్లు గడువు పొడిగించినప్పటికీ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్ శాతం పెరగలేదు. కాగా, తెలంగాణలో సర్ ప్రక్రియ పూర్తయినట్లు ఈనెల 12న సీఈవో ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే, ఈ నెల 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానున్నట్లు సమాచారం. ఆ తర్వాత నెల రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ కొనసాగనుంది. అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది.

## ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో సోమవారం నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సంపేటలో నిర్మించనున్న మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెట్టనున్నట్లు కేటీఆర్ కీలక ప్రకటన చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని అగ్రభాగాన నిలిచి నడిపించిన గొప్ప నాయకుడు పెద్ది అని ఆయన కొనియాడారు.దఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, "ఎంతకాలం జీవించామన్నది ముఖ్యం కాదు, ఎలా జీవించామన్నదే ప్రధానం. పెద్ది సుదర్శన్ రెడ్డి ఒక్క పర్యాయం ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసేలా పనిచేశారు" అని వ్యాఖ్యానించారు. ఆయన అంత్యక్రియలకు పోటెత్తిన అశేష జనవాహిని, ప్రజల్లో ఆయనకు ఉన్న గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు. సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకునే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని ఈ సందర్భంగా కేటీఆర్ భరోసా ఇచ్చారు. పార్టీ ఆవిర్భావం నుంచి కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న సుదర్శన్ రెడ్డి, జులై 31న గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన గతంలో జడ్పీటీసీ సభ్యుడిగా, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా సేవలందించడంతో పాటు, 2018-2023 మధ్య కాలంలో నర్సంపేట ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వహించారు. కాగా, నిన్న ఆదివారం నాడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పెద్ది సుదర్శన్ రెడ్డి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ క్రమంలో పార్టీ తరఫున ప్రకటించిన రూ. 2.25 కోట్ల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇందులో సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లల పేరున ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున, ఆయన తల్లి సంక్షేమం కోసం రూ. 25 లక్షలను కేటాయించారు.

## బండి సంజయ్ బతుకంతా మత రాజకీయమే

పట్టు వస్త్రాలు సమర్పించారని గుర్తుచేశారు. బోనాల ఏర్పాట్లపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవించే లౌకిక ప్రభుత్వమని స్పష్టం చేశారు. హిందూ ధర్మాన్ని, ప్రాచీన ఆలయాలను కాపాడేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏకంగా రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తోందని ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ పునర్నిర్మాణానికి రూ.250 కోట్లు, బాసరకు రూ.225 కోట్లు, భద్రాచలానికి రూ.351 కోట్లు, గోదావరి పుష్కరాల అభివృద్ధికి రూ.1,000 కోట్లు కేటాయించామని వివరించారు. అలాగే మొయినాబాద్, వేములవాడల లో రూ.197 కోట్లతో ఆధునిక గోశాలలను నిర్మిస్తున్నామని చెప్పారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆలయాల అభివృద్ధికి ఇంత భారీగా నిధులు కేటాయించారా అని ప్రశ్నించిన ఆయన.. సంజయ్‌కి చేతనైతే కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి మాట్లాడాలని సవాల్ విసిరారు.

## కోటి మందికిపైగా స్మార్ట్ రేషన్‌కార్డులు ఇవ్వబోతున్నాం

జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ పరిశీలించారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ... పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అరకొరగా రేషన్ కార్డులు ఇచ్చారని విమర్శించారు. కోటి 5 లక్షల మందికి కాంగ్రెస్ ప్రభుత్వంలో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కమిట్‌మెంట్‌తో పని చేస్తోందని జగ్గారెడ్డి తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షించదగిన విషయమన్నారు. ఇది ప్రభుత్వ కార్యక్రమమైనా కాంగ్రెస్ పార్టీ తరఫున సీఎం రేవంత్‌కు ఘనంగా స్వాగతం పలుకుతామని చెప్పారు. సభని 50 వేల మందితో నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

# సంపాదకీయం

## వెలుగు నీడలు




అమెరికా స్వాతంత్ర్య ప్రకటన ప్రజాస్వామ్య ప్రభాతం కాదు. క్రీస్తుపూర్వం రెండున్నర సహస్రాబ్దాల క్రితమే సిరియా, మెసొపొటేమియాలోని ప్రాచీన నాగరికతలలో ప్రజాస్వామ్య తొలి వెలుగులు ప్రసరించాయి. రాజులు, మతాధికారుల చేతుల్లో అధికారం కేంద్రీకృతం కాకుండా నిరోధించేందుకు ఆ పురాతన సమాజాలు ప్రజా మండళ్లను నిర్మించాయి. ఇవే ప్రాచీన గ్రీసులో స్ఫూర్తిదాయకమైన ఏథెనియన్ ప్రజాస్వామ్యానికి ప్రాతిపదికలు అయ్యాయి. ఆ తొలి యుగాలలో భారత ఉపఖండంలో వర్థిల్లిన గ్రామీణ గణతంత్రాలు కూడా ప్రజాస్వామ్య భావన, ఆచరణకు దోహదం చేశాయి. ప్రాతినిధ్య ప్రజాస్వామ్య తొలి పథగామి కావడమే అమెరికా విశిష్టత.నిరంకుశ పాలనతో తమను అణచివేస్తున్న బ్రిటన్‌తో తెగతెంపులు చేసుకుంటూ ఉత్తర అమెరికా ఖండంలో అట్లాంటిక్ తూర్పు తీరంలోని పదమూడు వలస రాజ్యాలు 1776లో స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నాయి. థామస్ జెఫర్సన్ రచించిన అమెరికా స్వాతంత్ర్య ప్రకటన మానవహక్కుల తాత్వికతకు సుప్రసిద్ధమయింది. అమెరికా సంస్థాపన పత్రమైన ఆ ప్రకటన మానవులు అందరూ సమానులేనని ఉద్ఘాటించింది. స్వేచ్ఛాజీవనం, ఆనందాన్ని అన్వేషించి పొందడం అనేవి వారి ప్రాథమిక హక్కులు అని పేర్కొంది. ప్రతి ఒక్కరికి ఉన్న ఆ స్వతస్సిద్ధ హక్కులను పరిరక్షించడమే ప్రభుత్వాల పరమ కర్తవ్యమని ఆ స్వాతంత్ర్య ప్రకటన ఘోషించింది. పాలితుల ఆమోదం మేరకే పాలకులు ఎవరు అనేది నిర్ణయమవుతుందంటూ ప్రజాస్వామ్యానికి ఒక కొత్త విప్లవాత్మక నిర్వచనాన్ని ఇచ్చింది. ప్రజలను పాలితుల నుంచి పౌరులుగా మార్చింది. తద్వారా ప్రజాసార్వభౌమత్వాన్ని వ్యవస్థీకరించి సుస్థిరపరిచింది.నేడు అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవం. 1976లో అమెరికా ద్విశతాబ్ది ఉత్సవాల సమయంలో వెల్లువెత్తిన ఆనందోత్సాహాలు ఇప్పుడు అంతగా లేవు. ప్రపంచ వ్యవహారాలలో అమెరికా ప్రాభవ ప్రాబల్యాలు తగ్గి పోతుండడమే కాకుండా, దేశీయంగా చోటు చేసుకుంటున్న పరిణామాలు స్వాతంత్ర్య ప్రకటన వాగ్దానాలు నెరవేరేందుకు తోడ్పడేవి కాకపోవడమే అమెరికన్ల నిర్లిప్తతకు కారణం. మానవులందరూ సమానులే అన్న స్వాతంత్ర్య ప్రకటన స్ఫూర్తి అమెరికా పాలనలో గానీ, సామాజిక జీవితంలో గానీ ప్రతి బింబించలేదు. సాక్షాత్తు అమెరికా సంస్థాపకులే బానిసత్వ వ్యవస్థను యథేచ్ఛగా కొనసాగించారు. ఆ అమానుష ఆచారాన్ని నిర్మూలించేందుకు దశాబ్దాలు పట్టింది. అంతర్యుద్ధం ప్రజ్వరిల్లి ఏడున్నర లక్షల మంది హతులైన తర్వాత గానీ బానిసత్వం రద్దు కాలేదు. అది రద్దయిన శతాబ్దానికిగానీ, ఆఫ్రికన్ అమెరికన్లు అయిన నల్ల జాతివారికి పౌరహక్కులు లభించలేదు. ఆనందసాధన ప్రతి ఒక్కరి హక్కు అని అంగీకరించినప్పటికీ ఆస్తుల యాజమాన్యానికి సంబంధించి చట్ట పరమైన రక్షణలు కల్పించలేదు. ఇలా సామాజిక, ఆర్థిక అసమానతలను ఉపేక్షించడాన్ని వివేచనా పరులు, మరీ ముఖ్యంగా అమానుష అణచివేతలకు గురైన నల్లజాతీ యులు మొదటినుంచీ తీవ్రంగా వ్యతిరేకిస్తూనే ఉన్నారు. నల్ల జాతీయులకు ఏమి ఇచ్చిందని నల్ల జాతి ప్రముఖుడు ఫ్రెడరిక్ డగ్లస్ 1852లోనే ప్రశ్నించారు. ఈ భూమండలం మీద సాటి మనుషుల రక్తంతో పాపపంకిలమైన జాతి అమెరికన్ జాతి మినహా మరొకటి లేదని ఆయన ఆనాడే గర్హించారు. 125 ఏళ్ల అనంతరం మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ కూడా ప్రపంచాన్ని హింసాగ్నులలో ముంచెత్తుతున్న ఏకైక దేశం అమెరికా అని నిరసించారు. ఈ విమర్శలు నేటి అమెరికాకు సైతం వర్తించేవిగా ఉన్నాయంటే అందుకు కారణం ఆ దేశ పాలక వర్గాలలో ఔదార్య స్వభావమూ, హృదయ వైశాల్యమూ తగ్గిపోవడం వల్లే కాదూ?

నిజాయితీపరులైన పెద్ద మనుషులు మాదిరిగా కంటే సంభావ్య దుష్టులుగానే మనుషులు ఎక్కువగా ఉంటారని, వారు ఎల్లవేళలా సద్గుణవంతులుగా వ్యవహరించేలా చేయలేము కనుక చెడుపనులకు పాల్పడడాన్ని అసాధ్యంచేసే పద్ధతులను కనుగొని తీరాలని ప్రజాస్వామ్యం భావిస్తుందని చైనీస్ రచయిత లిన్ యుటాంగ్ అంటారు. ఇంటా బయటా అటువంటి ప్రజాస్వామిక వివేకశీలతను పెంపొందించడం ప్రపంచపురాతన ప్రజాస్వామ్యవ్యవస్థ అయిన అమెరికా నైతిక కర్తవ్యం.

# లిఖిత రూపాల నిరంకుశత్వం

మన దేశంలో – సహజంగానే – కులవ్యవస్థ వ్యాప్తికీ, కొనసాగింపుకీ లిఖిత సంప్రదాయం ఉపకరించింది. 'విధిరాత'కి సర్వత్రా విధేయత లభించింది. అర్థం కానిదల్లా 'బ్రహ్మలిపి' అయింది. అయితే ఇది కొద్దిరోజుల్లో కొంతమంది ఒక చోట గుమిగూడి చేసిన కుట్ర కాదు; శతాబ్దాలపాటు క్రమేపీ దేశమంతటా వ్యాపించిన భావజాలం.మాట్లాడే జంతువు మనిషి మాత్రమే. సుమారు లక్ష సంవత్సరాల క్రిందట భాషకు మౌలిక రూపాలు ఏర్పడ్డాయని శాస్త్రజ్ఞుల అంచనా. ఆదిమ మానవులు గుంపులుగా వేటాడేటప్పుడు, ఒకరినొకరు హెచ్చరించుకుంటూ, జంతువు జాడను తెలియపరచుకుంటూ ముందుకి సాగిన కాలంలో శబ్దాలు, అనుకరణలు, మాటలు అవసరమయ్యాయి. వేట ముగిసాక, రాత్రిపూట మంట చుట్టూ చేరి, మాంసం తింటూ, ఆ రోజున జరిగిన సాహసాల్ని పిల్లలకు వివరించినప్పుడు కథలు పుట్టి ఉండవచ్చు. మాటలు, పాటలయ్యాయి; పాటకి నృత్యం తోడైంది. సాహిత్యం, సంగీతం, భాషతోనే వికసించాయి. భాష అనే ఉమ్మడి సాధనమే మానవ సమూహాల తొలి అస్తిత్వ ప్రకటన.లిపి తరవాతెప్పుడో (సుమారు క్రీ.పూ.3000) పుట్టింది. తిండిని పోగు చేసుకుంటూనో, వేటాడుతూనో, లేదా పశు పోషకులుగానో జీవించిన తెగలకు లిపి అవసరం లేదు. నదీ తీరాలలో స్థిర వ్యవసాయం మొదలై, పట్టణాలు వెల్లివిరిసాక -- నాగరికులకు ఎన్నో వస్తువులు, దినుసులు, వస్త్రాలు, మద్యం, వగైరాలు అవసరమ య్యాయి. అదనపు ఫలసాయం, వస్తు మార్పిడి, ఇతర ప్రాంతాలలో దొరికే వస్తువులను సంపాదించుకోవడానికి తోడ్పడ్డాయి. డబ్బు వాడుకలోకి వచ్చాక, దూర దేశాలతో వ్యాపారం సుగమం అయింది. నౌకా రవాణా వృద్ధి చెంది, రేవులు నగరాలయ్యాయి. ఈ క్రమంలోనే లిపి అవసరమైంది. సింధునదీ ప్రాంతంతో సహా అన్ని ప్రాచీన నాగరికతలలోనూ వర్తకుల ముద్రలకు, సుంకాల పట్టీలకు, పాలకుల ప్రకటనలకు లిపి ఆధారమైంది. శిలాక్షర రూపాల్లో శాసనాలు లిఖించబడ్డాయి.

తర్వాతి దశలో అంతవరకూ మౌఖికంగా ఉండిన జానపద గాథలకు లిఖిత రూపం ఇచ్చే ప్రయత్నం జరిగింది. ఆ రాతలు చిలవలు పలవలుగా విస్తరించాయి. ఒకే మూలకథ వివిధ ప్రాంతాల్లో, కాలాల్లో లిఖిత రూపాల్లోకి రూపాంతరం పొందింది. ఈ ప్రక్రియ, పండితుల పూనికతో, పాలకుల ఆధ్వర్యంలో జరిగింది. మౌఖిక రూపాలకు ఉండే స్థానికత, భిన్నత్వం, స్థలకాల విశేషాలకు అనుగుణంగా మలుచుకొనే ఒదుగుబాటు-- లిఖిత రూపాలకు లోపిస్తుంది. అవి శాశ్వత శాసనాలుగా, మార్చలేని బోధనలుగా తొందరలోనే అవతరిస్తాయి. దీన్నే ఆధునిక భాషా శాస్త్రానికి ఆద్యుడైన స్విస్ భాషాశాస్త్రవేత్త ఫెర్డినాండ్ డి సాసూర్ (1857--1913) 'లిఖిత రూపాల నిరంకుశత్వం' అన్నాడు. అతడి ప్రతిపాదనలను మన దేశానికి, మన ప్రాంతాలకు అన్వయించే ప్రయత్నం ఈ వ్యాసం.

పురాణాలు, ధర్మ సూత్రాలు, ముఖ్యంగా పవిత్ర గ్రంథాలు వెలువడ్డానికి లేఖనం గొప్ప వెసులుబాటుని కల్పించింది. స్థానిక విశ్వాసాల సముదాయాలు మతరూపంలో వ్యవస్థీకృతం అయ్యాయి. మనదేశంలో మాత్రం ఒక వైపు తెగల విశ్వాసాలు, మరో వైపు వ్యవస్థీకృత మతం చెట్టాపట్టాలు వేసుకుంటూ కొనసాగుతున్నాయి. చరిత్రకారుడు డి.డి. కోసంబి (1907--1966) చెప్పినట్లు -- కొత్తగా ప్రవేశించిన ఏ వ్యవస్థయినా పాత వ్యవస్థను పూర్తిగా తొలగించలేకపోవడం, అన్ని పురాతన పద్ధతులూ, లోలోపలి పొరలుగా కొనసాగడం, మన దేశపు ప్రత్యేకత. ఇందుకు మరో ఉదాహరణ -- వేల ఏళ్లపాటు కొనసాగిన వేదాల మౌఖిక రూపం. ఒక్క అక్షరం కూడా పొల్లు పోకుండా, ఉచ్చారణలో మార్పులు లేకుండా, ఈ పరంపర కొనసాగడం గొప్ప విశేషం. పవిత్ర బోధనలను ముఖస్థం చేయడమే సరైన పద్ధతి అని పూర్వీకుల భావన కావచ్చు; లేదా లిఖిత రూపంలో ఉంటే అవి ఎవరి చేతిలోకి వెళ్లి మైల పడతాయో అనే భయం కావచ్చు. నిష్ఠాపరులైన బ్రాహ్మణులకు తప్ప వేరెవరికీ అందుబాటులో లేని వేదాలను మినహాయిస్తే, పంచమ వేదమైన మహాభారతాన్నీ, అలాగే రామాయణ భాగవతాలనూ, పామరులకు విడమర్చి చెప్పేందుకై పండితులు అవసరం. ప్రవచనకారుల దృష్టి కథా, కథానాలకన్నా సామాన్య జనులు గ్రహించాల్సిన ధర్మ సూక్ష్మాలపైనే ఎక్కువగా ఉంటుంది. అన్ని వ్యవస్థీకృత మతాలలోనూ, పవిత్ర గ్రంథాల్లోని ఒక్క అక్షరాన్ని కూడా మార్చకూడదని సంప్రదాయవాదులు పట్టుబడతారు. ఆ విధంగా శాశ్వత ప్రాతిపదికపై సమాజాన్ని కట్టడి చేయగల సాధనాలను పాలకులు సమకూర్చుకున్నారు. ముద్రణాయంత్రం లిఖిత సంప్రదాయ సుస్థిరతకి, వ్యవస్థీకృత మతాల వ్యాప్తికి, విశేషంగా తోడ్పడింది.



మన దేశంలో -- సహజంగానే -- కులవ్యవస్థ వ్యాప్తికీ, కొనసాగింపుకీ లిఖిత సంప్రదాయం ఉపకరించింది. 'విధిరాత'కి సర్వత్రా విధేయత లభించింది. అర్థం కానిదల్లా 'బ్రహ్మలిపి' అయింది. అయితే ఇది కొద్దిరోజుల్లో కొంతమంది ఒక చోట గుమిగూడి చేసిన కుట్ర కాదు; శతాబ్దాలపాటు క్రమేపీ దేశమంతటా వ్యాపించిన భావజాలం. పాలకుల ఉనికిని కాపాడుకోవడానికీ, ప్రజల్ని నియంత్రించేందుకూ అత్యంత సామర్థ్యవంతమైన ఆలోచనా చట్రమే పాలకవర్గ భావజాలంగా పరిణమిస్తుంది. మౌఖిక భాషాభివృద్ధి దిగువనుండి, లిఖిత రూపం ఎగువనుండి -- తమ ప్రయాణాలను ఆరంభించాయి. ఈ క్రమంలో కులవ్యవస్థ కీలకమైన పాత్రను పోషించింది. నిజానికి భారతదేశంలో -- ప్రాచీన కాలంలోనైనా, ఆధునిక యుగంలోనైనా -- ఏ ఒక్క అభివృద్ధి ప్రక్రియ లేదా మార్పు కూడా కులవ్యవస్థకి బాహ్యంగా జరగలేదు. సామాజిక చలనం తీవ్రతరమైన సందర్భాలలో కూడా కులం బలహీన పడలేదు సరి కదా, కొత్త నిర్మాణాల్లోనూ విడదీయలేని భాగం అవుతూ వచ్చింది.

అత్యధిక సంఖ్యలో వినియోగదారులను చేరుకొనేందుకై సినిమా, టీవీ, ప్రింటు మీడియాలకు ప్రామాణిక భాష అవసరం అవుతుంది. సహజంగానే, అది ఆధిపత్య ప్రాంతాల మాండలికం అవుతుంది. ఆర్థికాభివృద్ధిలో, నదీజలాలతో సహా అన్ని సహజవనరుల అందుబాటులో తేడాల మూలంగా ఏర్పడే అసమానతలు, అంతర్గత దోపిడీ, ఉప--వలసీకరణలకి దారి తీస్తాయి. ప్రాంతీయ అస్తిత్వ ప్రకటనల్లో పైకి స్పష్టంగా కనిపించేది మాండలికం అని పిలువబడే భాష; ఆ వెనుకనే ఉండేవి చరిత్ర, సంస్కృతి. ఆర్థిక వెనుకబాటుతనం. తీవ్రమైన అసంతృప్తి, అస్తిత్వ చైతన్యాన్ని జ్వలింపజేస్తుంది; వేర్పాటువాద ఉద్యమాలు మొదల వుతాయి. అందుచేత మాండలిక భిన్నత్వం వెనుక పెద్ద కథే దాగి ఉంటుంది.

అదృష్టవశాత్తూ, ఈ నాణేనికి రెండవ పార్శ్వం కూడా ఉంది. ఇటీవలి కాలంలో, ఇంతవరకూ చదువుకి దూరంగా ఉంచబడిన సమూహాల చేతుల్లో అక్షరం ఆయుధంగా మారింది. స్వీయ అనుభవాల ప్రకటన లిఖిత రూపాల్లో ప్రాచుర్యం పొందుతోంది. ఇది ప్రజాస్వామ్యీకరణ వైపుగా మొదటి అడుగు. అక్షరాస్యత అందుబాటులోకి వచ్చాక, వారి కోసం ఎవరో కలం పట్టే అవసరం లేకుండా పీడిత సమూహాల సభ్యులే స్వయంగా రచనలు చేసే స్థాయికి ఒక్క తరంలోనే చేరుకున్నారు. నిజానికి అక్షర ప్రపంచంలోకి దూసుకొచ్చారు. ఈ రాక వెనుక గ్రామీణ పాఠశాలల్లో నిబద్ధతతో పని చేస్తున్న ఉపాధ్యాయుల అదృశ్య పాత్ర చెప్పుకో తగ్గది. దీనికొక నేపథ్యం ఉన్నది. సామ్రాజ్యవాద వ్యతిరేకత పెల్లుబికిన కాలంలో విద్యావంతులైన మధ్యతరగతి, అగ్రవర్ణ సమూహాలలో దేశ విముక్తి కోసమై ఆకాంక్ష బలపడింది. దానికి అనుబంధంగా సమానత్వం, సామ్యవాదం, ఆదర్శాలుగా నిలిచాయి. ఆ దశలోనే భారత రాజ్యాంగ నిర్మాణానికి బీజాలు పడ్డాయి. అభ్యుదయవాద లిఖిత సాహిత్యం ఉవ్వెత్తున ఎగసిపడి, పీడిత జనులకు దగ్గరయ్యే ప్రయత్నాలను ఉద్యమరూపాల్లో తీవ్రతరం చేసింది. ప్రజాహితంగా నడిచే ఏ ఉద్యమమైనా చైతన్యాన్ని రగిలిస్తుంది. అది ఎక్కడో, ఎప్పుడో, ఎవరో ఒకర్ని తాకుతుంది. ప్రజా కళారూపాలకు అభ్యుదయ, విప్లవోద్యమాలు సముచిత స్థానం కల్పించాయి.

బాధితులు తమ స్వరాన్ని వినిపింపజేయడం మొదలైనప్పుడు, ఆత్మకథలు, లిఖిత ప్రపంచానికి తెలియని జీవిత వృత్తాంతాలు, వెలువడడం సహజం. ఆ రచనలన్నీ ప్రధానంగా మాండలికాల్లో, యాసతో ఉంటాయి. వాటి నూతనత్వం, అప్పటికే వేళ్లూని ఉన్న లిఖిత వ్యవస్థల దృష్టిని ఆకర్షిస్తుంది. అయితే కొత్త తరానికి అది సరిపోదు. ధిక్కారంగా కొనసాగుతున్న ఈ చైతన్యం, స్వంత వేదికల నిర్మాణ దశకు చేరుకున్నది. ప్రత్యామ్నాయ విలువలను ప్రతిపాదిస్తూ, అన్ని సమూహాలనూ కలుపుకుపోగల సంఘటిత ఇంకా ఏర్పడలేదు. ఆ దశకు చేరినప్పుడు సమానత్వమే ఆదర్శంగా కలిగిన సామ్యవాద చైతన్యం ఆ సంఘటనను ముందుకి నడిపిస్తుంది.

సంఘటింగానో, అసంఘటితంగానో -- మౌఖిక రూపాలు లిఖిత ప్రపంచంలోకి ప్రవహిస్తున్న సుదినాలు మనవి. భాష పాత్రోచితంగా ఉండాలా? రచన మొత్తం మాండలికంలో ఉండాలా? ఇతర మాండలీకులను చేరుకొనేదెట్లా? ఇవన్నీ రచయితల నిర్ణయాలే. అచ్చ తెలుగుకి పెద్ద పీటను కేటాయించడం, సంస్కృత సమాసాల విషయంలో సంయమనం -- ఈనాటి సంకేతాలు.

మరో వైపు, అనువాదాలలో టెక్నాలజీ ఉపయోగం మెరుగుపడుతోంది. అది మాండలికాల మధ్య కూడా వారధి కాగలదా? ఇన్నాళ్లూ రచయితలు, చదువరులను మాత్రమే చేరుకొనే ప్రయత్నం చేస్తూ వచ్చారు. ఇప్పుడు పుస్తకాలను చదివి వినిపించే సాధనాలు వాడుకలోకి వచ్చాయి. పాడ్‌కాస్ట్‌లు శ్రోతలను చేరుకుంటున్నాయి. అంటే లిఖిత రచన మౌఖికంగా మారి, శ్రోతలను చేరుకుంటోంది! శ్రోతలు అక్షరాస్యులు కానక్కరలేదు. (పూర్వం రేడియో నాటికలు ఈ పని చేసాయి). రెండు భిన్న ప్రపంచాల మధ్య అగాధాన్ని పూడ్చడానికి టెక్నాలజీ సహకరిస్తున్నది.

లిఖిత ప్రపంచం ఇన్నాళ్లూ విధించిన నిరంకుశత్వాన్ని ఇప్పటికే ఛేదించిన నేటి రచయితలు, రాబోయే రోజుల్లో టెక్నాలజీని వినియోగిస్తూ, విభిన్న ఇతివృత్తాలు, మాండలికాలు, యాసలను వెలికి తీస్తూ, ప్రజల నానుడికి గొంతునిస్తూ, కొత్త పాఠక లోకాన్ని సృష్టించుకుంటారు. మన సాహిత్యం మరింత విస్తరిస్తుంది, శోభిల్లుతుంది. నూతన సమాజానికది మార్గదర్శకం అవుతుంది.

## యూనియన్ బ్యాంక్ సహకారంతో టీజీఎస్ఆర్టీసీ భరోసా : రోడ్డు ప్రమాదంలో అంగవైకల్యం పొందిన డ్రైవర్ కుటుంబానికి రూ50 లక్షల బీమా సహాయం అందించిన టీజీఎస్ఆర్టీసీ వీసీ & ఎండీ వై. నాగిరెడ్డి





**-కష్టకాలంలో కొండంత అండా : ఆర్టీసీ-యూబీఐ భాగస్వామ్యం భరోసా : ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత - ఎండీ వై. నాగిరెడ్డి**

**-ఉచిత ప్రమాద బీమా ద్వారా బాధిత ఉద్యోగి కుటుంబానికి 50లక్షల ఆర్థిక సహాయం**

**-సంస్థ సిబ్బందికి అక్కరకొస్తున్న యూబీఐ సూపర్ సాలరీ సేవింగ్ అకౌంట్**

( ఆగస్టు - 10- హంస కలంవార్త )

విధి నిర్వహణలో తీవ్రంగా గాయపడి శాశ్వత అంగవైకల్యంతో మంచానికే పరిమితమైన ఉద్యోగి కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) సహకారంతో కొండంత అండగా నిలిచింది. ఉచిత ప్రమాద బీమా పథకంలో భాగంగా బాధిత డ్రైవర్ కుటుంబానికి రూ. 50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించింది. కరీంనగర్ జిల్లా కోరుట్ల డిపో లో డ్రైవర్ గా పనిచేసే ఎండీ.మదార్ (E.323013) గత ఏడాది అక్టోబర్ 9వ తేదీ విధి నిర్వహణలో ప్రమాద బారిన పడి కాలు కోల్పోయారు. ఇంటికి పెద్ద దిక్కు శాశ్వత అంగవైకల్యం బారిన పడడంతో బాధిత డ్రైవర్ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ క్లిష్ట సమయంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందించే 'సూపర్ సాలరీ సేవింగ్ అకౌంట్' బాధిత కుటుంబానికి ఆసరాగా నిలిచింది. సంస్థ మార్గదర్శకాల ప్రకారం ఉద్యోగులందరూ యూబీఐ బ్రాంచీలలో ఖాతాలు తెరిచి రూపే కార్డులు పొంది ఉండటంతో, ఈ ఖాతా ద్వారా లభించే ఉచిత ప్రమాద బీమా వర్తించింది. సోమవారం హైదరాబాద్ బస్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీజీఎస్ఆర్టీసీ వీసీ & ఎండీ వై. నాగిరెడ్డి, యూబీఐ సిజిఎం ఎం. రవీంద్రబాబు, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎన్. సత్యనారాయణ బాబ్జిలతో కలిసి రూ. 50 లక్షల విలువైన చెక్కును బాధిత డ్రైవర్ మదార్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎండీ వై. నాగిరెడ్డి మాట్లాడుతూ తమ తప్పు లేకపోయినా రోడ్డు ప్రమాదాల బారిన పడి ఉద్యోగులు ప్రాణాలు కోల్పోవడం లేదా శాశ్వత అంగవైకల్యానికి గురికావడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. టీజీఎస్ ఆర్టీసీ నిరంతరం ఉద్యోగుల సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యతనిస్తుందని, ఆపదలో ఉన్న కుటుంబాలకు సంస్థ ఎల్లప్పుడూ ధైర్యంగా అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఇటువంటి బీమా పథకాలు అత్యవసర సమయాల్లో కుటుంబాలకు ఆత్మస్థైర్యాన్ని, ఆర్థిక భద్రతను ఇస్తాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఈ ప్రమాద బీమా పథకం ద్వారా 27 మంది ఆర్టీసీ సిబ్బంది కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం చేకూరిందని తెలుపుతూ, సంస్థ ఉద్యోగులకు విశేష సేవలందిస్తున్న యూనియన్ బ్యాంక్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సీహెచ్. వెంకన్న, ఎం. రాజశేఖర్, సాలమన్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప, సీపీఎం. ఉషాదేవిలతో పాటు



యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**-బాధిత డ్రైవర్ వివరాలు :**

కరీంనగర్ జిల్లా కోరుట్ల డిపోకు చెందిన డ్రైవర్ ఎండీ. మదార్ (స్టాఫ్ నంబర్: E323013) గత ఏడాది అక్టోబర్ 9వ తేదీన (09.10.2025) బస్సు (TS02Z 0040)పై కోరుట్ల నుండి హైదరాబాద్ వస్తుండగా, తెల్లవారుజామున 4:15 గంటల ప్రాంతంలో కుకనూర్ పల్లి వద్ద బ్రిడ్జిపై నిలిపి ఉంచిన లారీని (TS08UA4588) ఢీకొనడంతో తీవ్ర ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ఆయన తన కాలును పూర్తిగా కోల్పోయి శాశ్వత అంగవైకల్యానికి గురయ్యారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న ఉద్యోగి మంచాన పడటంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక, మానసిక సంక్షోభంలో కూరుకుపోయింది.

## ముత్తంగి కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఘనంగా బోనాల వేడుకలు

-తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థుల సందడి



( ఆగస్టు - 10- హంసకలం వార్త )

పటాన్చెరు, ముత్తంగిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఆషాఢమాస బోనాల వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా విద్యార్థులు వివిధ రకాల సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. బోనాల పండుగ విశిష్టతను తెలియజేస్తూ విద్యార్థులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. పాఠశాల ఆవరణలో బోనాల వేడుకలతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు సిహెచ్. రాజేష్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని, వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులకు మన పండుగల ప్రాముఖ్యతను చిన్ననాటి నుంచే తెలియజేయడం ద్వారా సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. బోనాల పండుగ ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని విద్యార్థులు తెలుసుకునేలా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొనడంతో బోనాల వేడుకలు వైభవంగా జరిగాయి.

# ఆరోగ్యమే మహాభాగ్యం.. ఆహారపు అలవాట్లే ఆరోగ్యానికి ఆధారం

(ఆగస్టు -10- హంస కలంవార్త )

ప్రస్తుత ఆధునిక జీవనశైలిలో మనిషి ఆరోగ్యంపై శ్రద్ధ తగ్గిపోతోంది. పని ఒత్తిడి, సమయాభావం, బయట ఆహారం, మాంసాహారాన్ని అధికంగా తీసుకోవడం, మద్యం సేవించడం, వ్యాయామం లేకపోవడం వంటి కారణాలతో చిన్న వయసులోనే అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. ఒకప్పుడు వయసు పెరిగిన తర్వాత వచ్చే అనేక సమస్యలు ఇప్పుడు యువతలో కూడా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా యూరిక్ యాసిడ్ పెరగడం, గౌట్, కీళ్ల నొప్పులు, ఆర్థరైటిస్‌కు సంబంధించిన సమస్యలు, అధిక బరువు, కొలెస్ట్రాల్, కాలేయం మరియు కిడ్నీలపై ఒత్తిడి వంటి సమస్యల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉంది.

**-మాంసాహారం పూర్తిగా మానేయాలా?**

మాంసాహారం తీసుకోవడం వల్ల ప్రతి ఒక్కరికీ అనారోగ్యం వస్తుందని చెప్పడం సరైంది కాదు. మాంసం, చేపలు, గుడ్లు వంటి ఆహారాల్లో శరీరానికి అవసరమైన ప్రోటీన్ వంటి పోషకాలు ఉంటాయి. అయితే అతిగా తినడం, తరచుగా అధిక పరిమాణంలో తీసుకోవడం, ఆహారంలో సమతుల్యత లేకపోవడం సమస్యలకు దారితీయవచ్చు. ముఖ్యంగా కొన్ని మాంసాహారాల్లో ప్యూరిన్లు అధికంగా ఉంటాయి. శరీరంలో ప్యూరిన్లు విచ్ఛిన్నమైనప్పుడు యూరిక్ యాసిడ్ ఏర్పడుతుంది. సాధారణంగా కిడ్నీలు అదనపు యూరిక్ యాసిడ్‌ను బయటకు పంపుతాయి. కానీ ఉత్పత్తి ఎక్కువ కావడం లేదా శరీరం దాన్ని సరిగా బయటకు పంపలేక పోవడం వల్ల రక్తంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరగవచ్చు. అది కొంతమందిలో గౌట్ అనే కీళ్ల సమస్యకు కారణమవుతుంది. అయితే యూరిక్ యాసిడ్ పెరిగిన ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా గౌట్ వస్తుందని కాదు.

**-మద్యం విషయంలో మరింత జాగ్రత్త**

మద్యం సేవించే అలవాటు ఉన్నవారు తమ ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. అధికంగా లేదా తరచుగా మద్యం సేవించడం వల్ల శరీరంలోని అనేక వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా యూరిక్ యాసిడ్ సమస్య ఉన్నవారిలో మద్యం కొన్ని సందర్భాల్లో సమస్యను మరింత తీవ్రం చేయవచ్చు. అందువల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనుకునే వారు మద్యం సేవించే అలవాటును పూర్తిగా మానేయడం లేదా కనీసం వైద్యుల సలహా మేరకు నియంత్రించుకోవడం మంచిది.

**-నా అనుభవం కూడా ఒక పాఠమే**

ఈ విషయాన్ని నేను కేవలం ఇతరులకు చెప్పడం కోసం మాత్రమే రాయడం లేదు. నా జీవితంలో కూడా ఇలాంటి అనుభవం ఎదురైంది. ఒక సమయంలో నాకు యూరిక్ యాసిడ్, కీళ్లకు సంబంధించిన సమస్యలు ఇబ్బంది పెట్టాయి. ఆ సమయంలో నా ఆహారపు అలవాట్లను పరిశీలించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. మద్యం పూర్తిగా మానేశాను. నాన్‌వెజ్ ఆహారాన్ని గణనీయంగా తగ్గించాను. అన్నం పరిమాణాన్ని కూడా తగ్గించాను. మొత్తం ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకున్నాను. అలాగే శరీరాన్ని చురుకుగా ఉంచడం, నీరు తగినంతగా తీసుకోవడం, జీవనశైలిపై శ్రద్ధ పెట్టడం వంటి విషయాలను పాటించాను. దాదాపు ఒక సంవత్సరం నుంచి ఏడాదిన్నర కాలంలో నా ఆరోగ్య పరిస్థితిలో నాకు మంచి మార్పు కనిపించింది. అయితే ఇది నా వ్యక్తిగత అనుభవం మాత్రమే. అందరికీ ఇదే విధంగా ఫలితం వస్తుందని చెప్పలేం. యూరిక్ యాసిడ్ లేదా కీళ్ల సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహాతో పరీక్షలు చేయించుకుని, కారణాన్ని తెలుసుకుని తగిన చికిత్స తీసుకోవాలి.

**-ప్రోటీన్ ఎక్కువైతే యూరిక్ యాసిడ్ తప్పనిసరిగా పెరుగుతుందా?**

ఇది కూడా ప్రజలు తెలుసుకోవాల్సిన ముఖ్యమైన విషయం. ప్రోటీన్ ఎక్కువగా తీసుకోవడం ఒక్కటే యూరిక్ యాసిడ్ పెరగడానికి కారణం కాదు. ఆహారంలోని కొన్ని ప్యూరిన్ అధికంగా ఉన్న పదార్థాలు, మద్యం, అధిక బరువు, కిడ్నీల పనితీరు, జన్యుపరమైన కారణాలు, కొన్ని మందులు, ఇతర ఆరోగ్య పరిస్థితులు వంటి అనేక అంశాలు యూరిక్ యాసిడ్ స్థాయిని ప్రభావితం చేయవచ్చు. కాబట్టి "ప్రోటీన్ తింటే యూరిక్ యాసిడ్ వస్తుంది" అని అందరికీ ఒకే విధంగా చెప్పడం శాస్త్రీయంగా సరైనది కాదు.

**-ఆరోగ్యం కోసం చిన్న మార్పులు.. పెద్ద ప్రయోజనాలు**

మన ఆరోగ్యం కోసం పెద్ద పెద్ద మార్పులు ఒక్కరోజులో చేయాల్సిన అవసరం లేదు. చిన్న చిన్న అలవాట్లను క్రమంగా మార్చుకోవచ్చు.

-మద్యం సేవించే అలవాటు ఉంటే మానేయడానికి ప్రయత్నించాలి.

-మాంసాహారాన్ని అధికంగా కాకుండా సమతుల్యంగా తీసుకోవాలి.

-ప్యూరిన్ అధికంగా ఉండే ఆహారాల విషయంలో వైద్యుల లేదా డైటీషియన్ సలహా తీసుకోవాలి.

-కూరగాయలు, పండ్లు, సంపూర్ణ ధాన్యాలు వంటి సమతుల్య ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

-తగినంత నీరు తీసుకోవాలి.

-శరీర బరువు ఆరోగ్యకరమైన స్థాయిలో ఉండేలా చూసుకోవాలి.

-రోజువారీ జీవితంలో శారీరక చలనం ఉండేలా చూసుకోవాలి.

-కీళ్లలో తరచుగా నొప్పి, వాపు లేదా అకస్మాత్తుగా తీవ్రమైన నొప్పి వస్తే నిర్లక్ష్యం చేయకూడదు.




-యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉందని తెలిసిన వారు స్వయంగా మందులు వాడకుండా వైద్యులను సంప్రదించాలి.

**-మందులు మాత్రమే పరిష్కారం కాదు.. జీవనశైలీ కూడా ముఖ్యం**

కొంతమంది ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చిన వెంటనే మందులు వేసుకుంటే సరిపోతుందని భావిస్తారు. మందులు అవసరమైన సందర్భాల్లో అవి ఎంతో ముఖ్యమైనవే. కానీ వాటితో పాటు ఆహారం, వ్యాయామం, నిద్ర, నీరు, బరువు, మద్యం వంటి జీవనశైలి అంశాలపై కూడా శ్రద్ధ అవసరం. ముఖ్యంగా యూరిక్ యాసిడ్ లేదా గౌట్ వంటి సమస్యలు ఉన్నవారు వైద్యులు సూచించిన చికిత్సను కొనసాగిస్తూ, తమకు సరిపోయే ఆహార విధానాన్ని పాటించాలి.

**-ప్రజలకు ఒక చిన్న విజ్ఞప్తి**

"నాకు ఏమీ కాదు" అనే నిర్లక్ష్యంతో ఆరోగ్యాన్ని పాడుచేసుకున్న తర్వాత బాధపడటం కంటే, ముందుగానే జాగ్రత్త పడటం ఎంతో మంచిది. రోజూ మద్యం, అధిక మాంసాహారం, అధిక కేలరీల ఆహారం, శారీరక శ్రమ లేకపోవడం వంటి అలవాట్లు ఉంటే ఒక్కసారి మన జీవనశైలిని మనమే పరిశీలించుకోవాలి. ఆరోగ్యం పోయిన తర్వాత డబ్బు ఖర్చు చేసి తిరిగి తెచ్చుకోవడం కష్టం. కానీ ఆరోగ్యం ఉన్నప్పుడే కొన్ని చెడు అలవాట్లను మార్చుకోవడం మాత్రం మన చేతుల్లోనే ఉంది. నా అనుభవం నాకు ఒక విషయం నేర్పింది---ఆరోగ్యం కోసం తీసుకున్న చిన్న నిర్ణయం కూడా జీవితంలో పెద్ద మార్పును తీసుకురాగలదు. అందుకే ప్రతి ఒక్కరూ తమ ఆహారం, అలవాట్లు, శారీరక చలనం, ఆరోగ్య పరీక్షలపై శ్రద్ధ పెట్టాలి. ఏ సమస్య ఉన్నా భయపడకుండా, నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

**-ఆరోగ్యమే నిజమైన సంపద..**

మన శరీరాన్ని మనమే కాపాడుకుందాం.. మంచి ఆహారం -- మంచి అలవాట్లు -- ఆరోగ్యకరమైన జీవితం కోసం ప్రతి ఒక్కరూ ఒక అడుగు ముందుకు వేయాలి.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇవ్వాలి

**-అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన పాస్టర్లు**



(ఆగస్టు -10- హంస కలంవార్త )

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించి, రాజ్యాంగం ప్రకారం ఎస్సీలకు అందుతున్న రిజర్వేషన్లు, రాయితీలు, హక్కులను వర్తింపజేయాలని పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు బిషప్ సీహెచ్ సాల్మాన్‌రాజ్, పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ రెవరెండ్ శాంసన్ మామిడి, పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ ఎం. ప్రభుదాస్ డిమాండ్ చేశారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఖమ్మం ఎక్స్‌రోడ్డు వద్ద బ్లాక్‌డే సందర్భంగా తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ సంఘం అధ్యక్షుడు బిషప్ దుర్గం ప్రభాకర్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1950లో అమలులోకి వచ్చిన రాష్ట్రపతి ఉత్తర్వుల కారణంగా మతం మారిన దళిత క్రైస్తవులు రాజ్యాంగపరంగా తమకు దక్కాల్సిన ఎస్సీ హోదా, రిజర్వేషన్లకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన దళితులకు ఎస్సీ హోదా కల్పించిన విధంగానే దళిత క్రైస్తవులకు కూడా సమాన హక్కులు ఎస్సీ హోదా కల్పించాలని కోరారు. మతం మారినంత మాత్రాన దళితుల సామాజిక పరిస్థితులు మారవని, వివక్ష కొనసాగుతున్న నేపథ్యంలో వారికి రాజ్యాంగపరమైన రక్షణలు, హక్కులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 సమానత్వాన్ని, ఆర్టికల్ 16 సమాన అవకాశాలను కల్పిస్తున్న నేపథ్యంలో దళిత క్రైస్తవుల విషయంలో వివక్ష కొనసాగడం బాధాకరమన్నారు. గ్రామాల్లో శ్మశాన వాటికలు, సామాజిక కార్యక్రమాలు, విద్య, ఉద్యోగాలు తదితర రంగాల్లో దళిత క్రైస్తవులు వివక్షకు గురవుతున్నారని పేర్కొన్నారు. దళిత క్రైస్తవుల సమస్యను రాజకీయ కోణంలో కాకుండా మానవ హక్కుల సమస్యగా చూడాలని నాయకులు కోరారు. దేశంలోని ఇతర వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు అందుతున్నప్పుడు దళిత క్రైస్తవులకు మాత్రం వాటిని నిరాకరించడం సమానత్వ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. విద్య, ఉద్యోగాలు, సామాజిక, ఆర్థిక రంగాల్లో దళిత క్రైస్తవులకు సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. దళిత క్రైస్తవుల న్యాయమైన డిమాండ్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా పరిశీలించాలని కోరారు. గతంలో వివిధ ప్రభుత్వాలు, రాష్ట్ర అసెంబ్లీలు ఈ అంశంపై కేంద్రానికి సిఫార్సులు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ అంశాన్ని అసెంబ్లీలో చర్చించి కేంద్ర ప్రభుత్వానికి బలమైన సిఫార్సు చేయాలని విజ్ఞప్తి చేశారు.దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే వరకు ఉద్యమాన్ని వివిధ రూపాల్లో కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. తాము కూడా ఓటు హక్కు కలిగిన భారత పౌరులమని, తమ సమస్యను ప్రభుత్వం సానుభూతితో పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమం లో బిషప్ సి. హెచ్. సాల్మాన్ రాజు, రెవ. శాంసన్ మామిడి, రెవ. డా. పి. జాన్ మార్క్, రెవ.యం. హాజర్య, రెవ. బి. జవహర్ పాల్, బ్రదర్ మీసాల ప్రభుదాసు, బిషప్ గడ్డం డేవిడ్ రాజు, బ్రదర్ జాటోత్ డేవిడ్ రాజు, రెవ. తలకప్పల సుధాకర్, రెవ. డా. జలగం జేమ్స్, రెవ.బాకీ పరంజ్యోతి, బిషప్ రెమడాల రూబెన్,గుంటూరు బాబు రావు,రెవ జక్కులరి రాజబాబు, ధరవత్ లాకు నాయక్, గుగులోత్ బాలాజీ నాయక్, సి. హెచ్. కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి కనిపించడం లేదా?

**-అవినీతి, అక్రమాలే బీజేపీ సిద్ధాంతం అని విజిత్ రావు విమర్శలు**

(ఆగస్టు -10- హంస కలంవార్త )



మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు చేసిన అభివృద్ధి పనులు బీజేపీ నాయకులకు కనిపించడం లేదా? అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు విజిత్ రావు ప్రశ్నించారు. సోమవారం పట్టణంలోని ఐబీ విశ్రాంత భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్య రామమందిరం నిర్మాణంలో జరిగిన అవినీతి బీజేపీ నాయకుల గొప్పతనాన్ని సూచిస్తుందన్నారు. వాట్సాప్ యూనివర్సిటీ, అంధ భక్తులు బీజేపీ నాయకులుగా చలామణి అవుతున్నారని ఏద్దేవా చేశారు. దేశంలో చదువు, భక్తి, ఐక్యత ఉన్నచోట బీజేపీ అధికారంలో లేదని వివరించారు.గత 30 ఏండ్లుగా నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి బీజేపీ నాయకులకు కనిపించడం లేదని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలను అజ్ఞానంలో ఉంచి రాజ్యమేలాలని చూస్తోందన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కోట్ల నిధులు వెచ్చించి రోడ్లు, మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేసిన ఘనత దివాకర్ రావుదేనని గుర్తు చేశారు. జిల్లా ఏర్పాటు,మెడికల్ కాలేజ్ లాంటి నిర్మాణాలు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి అని వివరించారు. అంతకుముందు మాజీ డీసీఎమ్మెస్ చైర్మన్లు మాట్లాడుతూ ఎరువులు ధరలు పెంచి రైతుల నడ్డి విరిచింది బీజేపీ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. 25 ఏండ్ల కిందటి పరిస్థితిని మరచిపోయి మాట్లాడటం బీజేపీ నాయకునికే చెల్లుతుందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎమ్మెస్ చైర్మన్లు తిప్పని లింగన్న, కేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, మాజీ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ తిరుపతి, నాయకులు పురుషోత్తం, చాంద్, ప్రభాకర్, బాపు తదితరులు పాల్గొన్నారు.

# ముత్యాలమ్మ తల్లి సన్నిధిలో రంగం.. భవిష్యవాణి





(ఆగస్టు -10- హంస కలంవార్త )

ఆషాఢ మాస బోనాల ఉత్సవాల్లో భాగంగా సికింద్రాబాద్ ప్రాంతంలోని ముత్యాలమ్మ ఆలయంలో సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలు అమ్మవారి నామస్మరణతో, భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. బోనాల ఉత్సవాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన రంగం కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి అనుగ్రహానికి ప్రతీకగా భావించే రంగం కార్యక్రమంలో సరిత అమ్మగారు రంగం ఎక్కి భవిష్యవాణి వినిపించారు. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భవిష్యవాణిని ఆసక్తిగా ఆలకించారు. ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న బోనాల సంప్రదాయంలో రంగం కార్యక్రమానికి ప్రత్యేక స్థానం ఉంది. అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని, సమాజం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ ఈ కార్యక్రమాన్ని భక్తులు పవిత్రంగా నిర్వహిస్తారు.

**-సంప్రదాయానికి ప్రతీకగా రంగం**

తెలంగాణ బోనాల పండుగలో బోనం, తొట్టెలు, పోతురాజు, ఘటం, రంగం వంటి సంప్రదాయాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ముఖ్యంగా రంగం కార్యక్రమం బోనాల ఉత్సవాల్లో ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక ఘట్టంగా కొనసాగుతోంది. అమ్మవారిని ఆరాధించే భక్తులు రంగం కార్యక్రమాన్ని ఎంతో భక్తితో, విశ్వాసంతో చూస్తారు.రంగం ఎక్కిన సమయంలో సరిత అమ్మగారు భక్తులను ఉద్దేశించి భవిష్యవాణి చెప్పడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమ్మవారి కృప ప్రజలపై ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని భక్తులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారి నామస్మరణ చేస్తూ, జై ముత్యాలమ్మ.. జై మహంకాళి అంటూ నినాదాలు చేశారు.

**-భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ**

ఉదయం నుంచే ముత్యాలమ్మ ఆలయానికి భక్తుల రాక ప్రారంభమైంది. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో అలంకరించుకుని తలపై బోనాలను మోసుకొచ్చారు. బోనాలలో అమ్మవారికి నైవేద్యంగా సమర్పించే వంటకాలను సిద్ధం చేసి భక్తిశ్రద్ధలతో ఆలయానికి తీసుకువచ్చారు.బోనాల ఊరేగింపులు, డప్పు చప్పుళ్లు, పోతురాజుల నృత్యాలు, భక్తుల నృత్యాలతో పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. తమ కుటుంబాల్లో సుఖశాంతులు నెలకొనాలని, పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరికీ మంచి జరగాలని కోరుకుంటూ భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

**-భవిష్యవాణికి ప్రత్యేక స్థానం**

తెలంగాణలో బోనాల పండుగ కేవలం ఒక ఆధ్యాత్మిక వేడుక మాత్రమే కాకుండా శతాబ్దాలుగా కొనసాగుతున్న ప్రజల విశ్వాసాలు, ఆచారాలు, జానపద సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలుస్తోంది. అందులో రంగం కార్యక్రమం ఒక ముఖ్యమైన సంప్రదాయంగా భావిస్తారు.రంగం కార్యక్రమంలో చెప్పే భవిష్యవాణిని భక్తులు తమ విశ్వాసాల ప్రకారం స్వీకరిస్తారు. సమాజానికి మంచి జరగాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారి ఆశీస్సులు కోరడం ఈ సంప్రదాయంలోని ప్రధాన భావనగా చెప్పవచ్చు. సరిత అమ్మగారు రంగం ఎక్కి చెప్పిన భవిష్యవాణిని కూడా భక్తులు ఆసక్తిగా విన్నారు.

**-అమ్మవారి ఆశీస్సులతో ప్రజలకు మేలు జరగాలి**

ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ.. ముత్యాలమ్మ తల్లి దయతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులకు మేలు జరగాలని, కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని, యువత మంచి మార్గంలో ముందుకు సాగాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని కోరుకున్నారు.బోనాల పండుగలో మహిళల పాత్ర అత్యంత ముఖ్యమైనది. అమ్మవారికి బోనం సమర్పించే సంప్రదాయాన్ని మహిళలు తరతరాలుగా కొనసాగిస్తున్నారు. కుటుంబ సంక్షేమం కోసం మొక్కులు చెల్లించడం, అమ్మవారికి నైవేద్యాలు సమర్పించడం, పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా వారు తమ భక్తిని చాటుకుం టున్నారు.

**-తెలంగాణ సంస్కృతికి అద్దం పడుతున్న బోనాలు**

బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. నగర జీవనంలో ఆధునికత పెరుగుతున్నప్పటికీ బోనాల సందర్భంగా ప్రజలు తమ సంప్రదాయాలను గుర్తు చేసుకుంటూ ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. యువత కూడా బోనాల వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటూ తెలంగాణ సంస్కృతిని ముందుకు తీసుకెళ్తున్నారు. ముత్యాలమ్మ ఆలయంలో నిర్వహించిన బోనాల వేడుకల్లో భక్తుల సందడి ప్రత్యేకంగా కనిపించింది. ఆలయ పరిసరాల్లో అమ్మవారి భక్తిగీతాలు, డప్పుల మోత, నృత్యాలు ఉత్సవ వాతావరణాన్ని మరింత పెంచాయి. మహిళలు బోనాలతో తరలిరాగా, యువత సంప్రదాయ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

**-రంగం కార్యక్రమంతో ముగిసిన మరో ఆధ్యాత్మిక ఘట్టం**

బోనాల ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన రంగం కార్యక్రమం భక్తులకు ప్రత్యేక అనుభూతిని కలిగించింది. సరిత అమ్మగారు రంగం ఎక్కి భవిష్యవాణి చెప్పడంతో భక్తులు శ్రద్ధగా ఆలకించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని భక్తులు కోరుకున్నారు. భక్తుల విశ్వా సాలకు, తెలంగాణ జానపద సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ ప్రతి సంవత్సరం కొత్త ఉత్సాహాన్ని తీసుకువస్తోంది. ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరి జీవితాల్లో సుఖశాంతులు, సంతోషం, ఐశ్వర్యం నెలకొనాలని భక్తులు ప్రార్థించారు.

జై ముత్యాలమ్మ తల్లి.. జై మహంకాళి.. జై తెలంగాణ సంస్కృతి..

# గీత కార్మికులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలి

**-గీతన్న చైతన్య యాత్ర బస్సు యాత్రకు మద్దతు తెలిపిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ.**

(ఆగస్టు -10- హంస కలంవార్త )

తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలకు ముందు కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని కల్లుగీత వృత్తిని ఆధునికరించి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవడం ఇచ్చిన హామీలను విస్మరించడమే అని తక్షణం కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వం పూనుకోవాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.లికల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 2 నుండి 18 వరకు అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర సోమవారం జనగామకు చేరుకుంది. ఈ సందర్భంగా గీత కార్మికులు పెద్ద ఎత్తున యాత్ర బృందానికి స్వాగతం పలికి సూర్యాపేట రోడ్డు నెల్లుట్ల శివారు నుండి పట్టణంలోని ఓం సాయి గార్డెన్ వరకు భారీ ఎత్తున డప్పు చప్పుడు నృత్యాలతో భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కార్యదర్శి బాల్నే వెంకట మల్లయ్య అధ్యక్షతన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో తాటి చెట్ల మీద నుండి పడి మరణించిన వికలాంగులైన వాళ్లకు ఇవ్వాల్సిన ఎక్స్గ్రేషియో బకాయిలు కేవలం 20 కోట్లు ఉన్నాయని లక్షల కోట్ల బడ్జెట్ పెడుతున్న ప్రభుత్వానికి అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో మొదటి వరుసగా ఉంటున్నామని ముఖ్యమంత్రి గొప్పలు చెబుతున్న గీత కార్మికులకు ఇవ్వడానికి ఎక్స్గ్రేషియో బకాయిలకు ప్రభుత్వం వద్ద నిధులు లేవా అని ప్రశ్నించారు. కల్లుగీత వృత్తిదారులకు చెట్ల పెంపకానికి భూమి ఇవ్వమని సంవత్సరాల తరబడి అడుగుతున్న పాలకులు ఎవరు పట్టించుకోవడం లేదు బడా బాబులు ఎంతోమంది ఆక్రమించిన భూములు ఉన్నాయి. ప్రభుత్వ భూములు ఉన్నాయి వాటిని ఇవ్వొచ్చు కాదా అని ప్రశ్నించారు. కొనివ్వడానికి వృత్తిని ఆదుకోవడానికి ఈ పాలకులకు చేతులు రావడంలేదని తీవ్రంగా విమర్శించారు.రాష్ట్రంలో దేశంలో పీడిత వర్గాలు వృత్తిదారులు కార్మికులు కర్షకులు ఐక్యం కావలసిన అవసరం ఉన్నదని ఐక్యం అయినప్పుడే పాలకుల మెడలు వంచగలమని సర్దార్ సర్వాయి పాపన్న అణగారిన వర్గాలను ఐక్యం చేసి రాజ్యపాలన చేశాడని పాపన్న స్ఫూర్తితో కల్లుగీత కార్మికులు శ్రామిక వర్గ రాజ్య స్థాపన కోసం జరిగే పోరాటంలో భాగస్వాములు కావాలని ఆపోరాటాలు ముందు వరుసను నిలబడాలని మీకు ఎల్లవేళలా సిపిఎం అండగా ఉంటుందని ఈ సమస్యలన్నిటిని ప్రభుత్వం దృష్టికి సిపిఎం పార్టీ పక్షాన తీసుకపోయి పరిష్కారం కోసం ఒత్తిడి పెంచుతామని సభలో వారు అన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం. వి.రమణ మాట్లాడుతూ 50 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్ ఇవ్వాలని జీవో ఉన్నప్పటికీ కొత్తగా ఎవరి దరఖాస్తులు స్వీకరించడం లేదని అన్నారు.వృత్తిలో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచం ఇస్తుందన్నారు. రాష్ట్రంలో సభ్యత్వం కలిగిన వాళ్లు 2 లక్షల 30 వేల మంది ఉండగా కేవలం 30 వేల మందికే ఇచ్చారని అన్నారు.వృత్తి చేసే వారందరికీ వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. నందలంలోని నీరా ప్రాజెక్టుకు గత ప్రభుత్వం మిషనరీ భవనం సమకూర్చింది దాన్ని ఇప్పటివరకు పట్టించుకోవడం లేదు ఇది బీసీ సంక్షేమ శాఖ పరిధిలో ఉంటుందని బిసి సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న పొన్నం ప్రభాకర్ కనీసం దాన్ని సందర్శన కూడా చేయలేదని విమర్శించారు.తక్షణం నీర ప్రాజెక్టును ప్రారంభించి కల్లుగీత వృత్తిలో నూతన వరవడిని తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు.అలాగే పాపన్న నిర్మించిన కోటలను పరిరక్షించి పర్యాటక కేంద్రాలుగా గుర్తించి నిధులు కేటాయించాలని ఈసందర్భంగా వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు సుప్రజ హాస్పిటల్ ఎండి శిగ విజయ్ కుమార్ హైకోర్టు న్యాయవాది నలుమాసు కృష్ణ జిల్లా అధ్యక్షులు బూడిది గోపి తదితరులు ప్రసంగించారు. ఈకార్యక్రమంలో బస్సు యాత్ర బృందం నాయకులు



ఉష గౌని వెంకట నరసయ్య గైని వెంకన్న చౌగోని సీతారాములు గైని సాంబయ్య సంఘం మాజీ కార్యదర్శి భీమగోని చంద్రయ్య జనగామ మున్సిపల్ కౌన్సిలర్లు పాముకుంట్ల ప్రసాద్ గోపగోని సుగుణాకర్ బూడిది జ్యోతి జిల్లా గౌరవాధ్యక్షులు కుర్ర ఉప్పలయ్య ఆర్టిఏ మెంబర్ సిలువేరు అభి గౌడ్ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ సురుగు రాజేష్ సంఘం జిల్లా నాయకులు కమ్మగోని నాగన్న మాచర్ల రఘురాములు కంకటి రాజన్న ఫరీదుల భాస్కర్ బండపల్లి శంకరయ్య బాల్య ఉమాపతి బస్వాగోని మహేందర్ కుర్ర రాజు నామాల యాదగిరి కమ్మగాని పరశురాములు తాళ్లపల్లి మదర్ బాల్నే రాజయ్య తాళ్లపల్లి అశోక్ భైరగొని బలరాం యాదన్న పరంగాములు పోతుగంటి కృష్ణమూర్తి బత్తిని సురేందర్ మూల కిరణ్ ఘనగోని రమేష్ పులి శ్రీనివాస్ నాయిని యాదగిరి మిట్ట బిక్షపతి మూల వైకుంఠం పోతుల ఆంజనేయులు చీకట్ల నవీన్ జనగామ జిల్లా గోపా జిల్లా కార్యదర్శి బైరగోని శ్రీనివాస్ బాల్నే విద్యాసాగర్ కోశాధికారి దూడల రాజా సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# సేవే ధ్యేయంగా--మానవత్వమే మార్గంగా





**-హోప్ ఫౌండేషన్ 10 ఏళ్ల సేవా ప్రస్థానం**

**-ఒక చిన్న సేవా కార్యక్రమంతో మొదలై... వేలాది జీవితాల్లో ఆశాకిరణంగా మారిన పది సంవత్సరాల ప్రయాణం**

హైదరాబాద్, ఆగస్టు 10, 2026: సేవ చేయాలనే సంకల్పానికి ఆస్తులు అవసరం లేదు... మంచి మనసు ఉంటే చాలు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, అవసరమైన వారికి చేయూతనివ్వడం, బాధలో ఉన్నవారి ముఖంలో చిరునవ్వు తీసుకురావడం కంటే గొప్ప మానవత్వం మరొకటి లేదు. అలాంటి మానవతా విలువలను తన సేవా కార్యక్రమాలకు ప్రాతిపదికగా చేసుకుని ముందుకు సాగుతున్న హోప్ ఫౌండేషన్ నేటితో పది సంవత్సరాల సేవా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. 2016 ఆగస్టు 10న ఒక సేవా కార్యక్రమంతో ప్రారంభమైన హోప్ ఫౌండేషన్ ప్రయాణం... నేడు ఎన్నో సేవా కార్యక్రమాలకు, ఎన్నో మంచి పనులకు, ఎంతోమంది నిరుపేదల జీవితాల్లో ఆశకు ప్రతీకగా నిలిచింది. ఈ పదేళ్ల ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా సేవా కార్యక్రమాల విషయంలో వెనుకడుగు వేయకుండా ముందుకు సాగడం హోప్ ఫౌండేషన్ ప్రత్యేకతగా నిలిచింది. భగవంతుని ఆశీస్సులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, మిత్రులు, సేవాభిమానులు, శ్రేయోభిలాషులు, మరియు ప్రజల సహకారంతో ఫౌండేషన్ అనేక కార్యక్ర మాలను నిర్వహిస్తూ సమాజంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. పది సంవత్సరాలు... ఒక సంస్థ ప్రయాణం మాత్రమే కాదు పది సంవత్సరాలు అంటే క్యాలెండర్‌లో కొన్ని సంవత్సరాలు గడిచిపోవడం మాత్రమే కాదు. ఒక సేవా సంస్థకు అది ఎన్నో అనుభవాలు, ఎన్నో సవాళ్లు, ఎన్నో మధుర జ్ఞాపకాలు, ఎన్నో కుటుంబాలకు చేరువైన సందర్భాలు, ఎన్నో కన్నీళ్లను తుడిచిన క్షణాలు, ఎన్నో చిరునవ్వులను చూసిన సందర్భాల సమాహారం. హోప్ ఫౌండేషన్‌కు కూడా ఈ పదేళ్ల ప్రయాణం అలాంటి అనుభవాల సమాహారమే. ఒక చిన్న ఆలోచనగా మొదలైన సేవా కార్యక్రమం క్రమంగా ఒక ఉద్యమంగా మారింది. సేవ చేయాలనే ఆలోచనను కార్యరూపంలోకి తీసుకురావడం, నిరుపేదలకు అవసరమైన సమయంలో సహాయం అందించడం, ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం, సమాజంలో అవసరమైన చోట తన వంతు బాధ్యతను నిర్వర్తించడం వంటి కార్యక్రమాలు హోప్ ఫౌండేషన్ సేవా ప్రస్థానంలో కీలకంగా మారాయి. ఆకలి బాధను అర్థం చేసుకున్న సేవా దృక్పథం మన సమాజంలో ఎన్నో కుటుంబాలు ప్రతిరోజూ జీవన పోరాటం సాగిస్తున్నాయి. ఒక పూట భోజనం కోసం కూడా ఇబ్బంది పడే పరిస్థితులు కొన్ని కుటుంబాల్లో ఉన్నాయి. అలాంటి వారికి ఆకలి తీర్చడం అత్యంత ప్రాథమికమైన సేవ. ఈ ఆలోచనతోనే హోప్ ఫౌండేషన్ నిరంతర అన్నదాన కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చింది. పేదలు, నిరుపేదలు, కార్మికులు, వృద్ధులు, అవసరంలో ఉన్నవారు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు అన్నప్రసాదాన్ని అందిస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోంది. అన్నదానం కేవలం ఒక భోజనం అందించడం కాదు. ఆకలితో ఉన్న మనిషికి ఆ సమయంలో అండగా నిలవడం. అతనిలో మనం కూడా ఒక మనిషినే చూస్తున్నామని తెలియజేయడం. అందుకే హోప్ ఫౌండేషన్ నిర్వహించే అన్నదాన కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. వారానికి ఒకసారి, నిరంతరంగా జరిగే సేవా కార్యక్రమాలు క్రమంగా ప్రజల ఆదరణ పొందాయి. రోజులు, వారాలు, నెలలు గడిచినా సేవా కార్యక్రమాల పరంపర కొనసాగుతూనే ఉంది. సేవలో నిరంతరత్వమే అసలైన విజయం ఒకరోజు సేవా కార్యక్రమం నిర్వహించడం సులభమే. కానీ సంవత్సరాల తరబడి ఎలాంటి విరామం లేకుండా సేవా కార్యక్రమాలను కొనసాగించడం మాత్రం అంత సులభం కాదు. అందుకు నిరంతర సంకల్పం అవసరం. ఆర్థిక వనరులు అవసరం. సేవాభావం అవసరం. స్వచ్ఛంద కార్యకర్తల సహకారం అవసరం. ముఖ్యంగా కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలనే పట్టుదల అవసరం. హోప్ ఫౌండేషన్ ఈ విషయంలో ప్రత్యేకమైన నిబద్ధతను చూపించింది. ఒక కార్యక్రమంతో మొదలైన ప్రయాణం అనేక కార్యక్రమాలకు విస్తరించింది. సేవకు అవసరమైన ప్రతి సందర్భాన్ని గుర్తిస్తూ ముందుకు సాగింది. ఆపదలో అండగా... అవసరంలో చేయూతగా సమాజంలో ప్రతి ఒక్కరి పరిస్థితి ఒకేలా ఉండదు. కొందరికి అన్ని సౌకర్యాలు ఉంటే, మరికొందరు కనీస అవసరాల కోసం కూడా పోరాడాల్సిన పరిస్థితి ఉంటుంది. అలాంటి కుటుంబాలకు చిన్న సహాయం కూడా పెద్ద అండగా మారుతుంది. హోప్ ఫౌండేషన్ తన సేవా కార్యక్రమాల్లో ఇలాంటి కుటుంబాలను గుర్తించి, వారికి సాధ్యమైనంత మేరకు సహాయం అందిస్తూ వస్తోంది. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు చేయూతనివ్వడం, అత్యవసర పరిస్థితుల్లో అండగా నిలవడం, అవసరమైన వారికి మానవతా దృక్పథంతో సహాయం అందించడం వంటి కార్యక్రమాలు ఫౌండేషన్ సేవా ప్రస్థానంలో భాగమయ్యాయి. ఒక కుటుంబానికి అందించిన సహాయం చిన్నదిగా కనిపించినా, ఆ కుటుంబానికి అది ఎంతో పెద్ద భరోసా కావచ్చు. అందుకే సేవలో సహాయం పరిమాణం కంటే దాని వెనుక ఉన్న మానవత్వమే ముఖ్యమని హోప్ ఫౌండేషన్ తన సేవల ద్వారా చాటిచెప్పింది.

**-కుటుంబ సభ్యుల సహకారం... సేవా ప్రయాణానికి బలం**

ఏ సేవా సంస్థ విజయవంతం కావాలన్నా దాని వెనుక కుటుంబ సభ్యుల సహకారం ఎంతో ముఖ్యమైనది. హోప్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాల వెనుక కూడా కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, సహకారం కీలకంగా నిలిచింది. సేవా కార్యక్రమాలకు సమయం కేటాయించడం, అవసరమైన ఏర్పాట్లు చేయడం, కార్యక్రమాల నిర్వహణలో భాగస్వాములు కావడం వంటి అనేక విధాలుగా కుటుంబ సభ్యులు అండగా నిలిచారు. భగవంతుని ఆశీస్సులు, కుటుంబ సభ్యుల సహకారం, మిత్రుల ప్రోత్సాహం కలిసివచ్చినప్పుడే ఈ పదేళ్ల ప్రయాణం సాధ్యమైందని ఫౌండేషన్ నిర్వాహకులు పేర్కొంటున్నారు.

**-దాతలు... సేవా కార్యక్రమాలకు వెన్నెముక**

సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో దాతల పాత్ర ఎంతో గొప్పది. తమ సంపాదనలో కొంత భాగాన్ని సేవా కార్యక్రమాలకు కేటాయించే దాతలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారు. హోప్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలకు అనేక మంది దాతలు తమ వంతు సహకారం అందించారు. ఆ సహకారం వల్లే మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు అవకాశం ఏర్పడింది. దాతలు అందించే ప్రతి రూపాయి వెనుక ఒక నమ్మకం ఉంటుంది. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం సేవా సంస్థ బాధ్యత. అందుకే అందిన సహాయాన్ని అవసరమైన చోట సద్వినియోగం చేస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగించడమే లక్ష్యంగా ఫౌండేషన్ ముందుకు సాగుతోంది. స్వచ్ఛంద సేవకుల పాత్ర అమూల్యంసేవా కార్యక్రమాలు కేవలం ఒకరి వల్ల విజయవంతం కావు. వాటి వెనుక ఎంతోమంది స్వచ్ఛంద సేవకుల కృషి ఉంటుంది. అన్నదాన కార్యక్రమాల్లో ఏర్పాట్ల నుంచి భోజనం అందించడం వరకు, అవసరమైన వారికి సహాయం చేయడం నుంచి కార్యక్రమాలను సమన్వయం చేయడం వరకు అనేక బాధ్యతలను స్వచ్ఛంద సేవకులు నిర్వర్తిస్తారు. హోప్ ఫౌండేషన్‌తో కలిసి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయాల్సిందే. వారు కేటాయించిన సమయం, శ్రమ, సేవా భావం ఫౌండేషన్ ప్రయాణానికి మరింత బలాన్ని ఇచ్చాయి.

**-పదేళ్లలో ఎన్నో మధుర జ్ఞాపకాలు**

ఈ పదేళ్లలో హోప్ ఫౌండేషన్ ఎన్నో కార్యక్రమాలను నిర్వహించింది. ప్రతి కార్యక్రమం వెనుక ఒక కథ ఉంది. ప్రతి సేవ వెనుక ఒక కుటుంబం ఉంది. ప్రతి చిరునవ్వు వెనుక ఒక సహాయం ఉంది. ఆకలితో వచ్చిన వ్యక్తి భోజనం చేసి సంతృప్తిగా వెళ్లిన క్షణం... సహాయం అందుకున్న కుటుంబం కృతజ్ఞతతో చూసిన చూపు... అవసరంలో ఉన్న వ్యక్తికి చేయూత అందించినప్పుడు కనిపించిన ఆనందం... ఇవన్నీ హోప్ ఫౌండేషన్ సేవా ప్రయాణంలో మరచిపోలేని జ్ఞాపకాలు. సేవా సంస్థలకు అసలైన గుర్తింపు అవార్డులు, ప్రశంసాపత్రాలు మాత్రమే కాదు. తాము చేసిన సహాయం వల్ల ఒకరి జీవితంలో వచ్చిన చిన్న మార్పు. అదే నిజమైన విజయమని ఫౌండేషన్ భావిస్తోంది.

**-కరోనా సమయంలో మానవత్వానికి అండగా**

ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా మహమ్మారి సమయంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ సమయంలో ఉపాధి కోల్పోయిన కుటుంబాలు, ఆహారం కోసం ఇబ్బందులు పడిన వారు, బయటకు వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్న ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారు. అలాంటి క్లిష్ట సమయంలో సేవా సంస్థల పాత్ర ఎంతో కీలకమైంది. మానవత్వం ఎక్కడ ఉందో చూపించాల్సిన సమయం అది. హోప్ ఫౌండేషన్ కూడా తన పరిధిలో ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ముందుకు వచ్చింది. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలనే సేవా దృక్పథాన్ని కొనసాగించింది. కష్టకాలంలో మనిషికి మనిషి అండగా నిలవాలనే సందేశాన్ని ఈ సేవా కార్యక్రమాలు చాటిచెప్పాయి.

**-సేవకు సరిహద్దులు లేవు**

సేవ అనేది కులం, మతం, ప్రాంతం, భాష, రాజకీయాలకు అతీతమైనది. ఆకలికి మతం ఉండదు. బాధకు కులం ఉండదు. అవసరానికి ప్రాంతం ఉండదు. అందుకే సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరినీ సమానంగా చూడటం అత్యంత ముఖ్యమైన విషయం. హోప్ ఫౌండేషన్ తన సేవా కార్యక్రమాల్లో మానవత్వాన్నే ప్రధాన ప్రమాణంగా తీసుకుని ముందుకు సాగుతోంది. ఎవరికి అవసరం ఉన్నా, తమ పరిధిలో వారికి సహాయం చేయాలనే ఉద్దేశంతో కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

**-యువతకు సేవా స్ఫూర్తి**

నేటి యువతలో ప్రతిభ, శక్తి, ఆలోచనా సామర్థ్యం అపారంగా ఉంది. ఆ శక్తిని సమాజ సేవ వైపు మళ్లిస్తే సమాజంలో గొప్ప మార్పు తీసుకురావచ్చు. యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల వారికి సామాజిక బాధ్యతపై అవగాహన పెరుగుతుంది. ఇతరుల కష్టాలను అర్థం చేసుకునే గుణం పెరుగుతుంది. సమాజం పట్ల బాధ్యత కలుగుతుంది. హోప్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లో యువత కూడా భాగస్వాములు కావాలని, తమ సమయం మరియు శక్తిని సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలకు కేటాయించాలని పిలుపునిస్తోంది.ఒక మొక్కలా మొదలై... మహావృక్షంగా ఎదిగిన సేవా ప్రస్థానం పది సంవత్సరాల క్రితం నాటిన ఒక చిన్న మొక్క నేడు మహావృక్షంగా ఎదిగినట్టే హోప్ ఫౌండేషన్ సేవా ప్రయాణం విస్తరించింది. ప్రారంభంలో కొద్దిమందితో నిర్వహించిన కార్యక్రమాలు క్రమంగా పెద్ద సంఖ్యలో ప్రజలకు చేరాయి. సేవా కార్యక్రమాల పరిధి పెరిగింది. సేవ చేయాలనే ఆలోచన కలిగిన అనేక మంది ఫౌండేషన్‌తో కలిశారు. ఇది ఒక్కరి విజయం కాదు. ఇది సమిష్టి విజయం. సేవా కార్యక్రమాలకు సహకరించిన ప్రతి దాత విజయంలో భాగస్వామి. కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రతి స్వచ్ఛంద సేవకుడు విజయంలో భాగస్వామి. భోజనం స్వీకరించిన ప్రతి వ్యక్తి ఆశీర్వాదం ఈ ప్రయాణంలో భాగం. ప్రోత్సహించిన ప్రతి కుటుంబ సభ్యుడు, మిత్రుడు, శ్రేయోభిలాషి ఈ విజయానికి భాగస్వామే.

**-రాబోయే రోజుల్లో మరింత విస్తృత సేవ**

పది సంవత్సరాలు పూర్తి కావడం ఒక ముగింపు కాదు. మరో కొత్త అధ్యాయానికి ఆరంభం. ఇకపై మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలను నిర్వహించాలనే సంకల్పంతో హోప్ ఫౌండేషన్ ముందుకు సాగుతోంది. ఆకలితో ఉన్నవారికి అన్నదానం, అవసరంలో ఉన్న కుటుంబాలకు సహాయం, పేదలకు చేయూత, సామాజిక అవగాహన కార్యక్రమాలు, విద్య, ఆరోగ్యం, పర్యావరణం వంటి అనేక రంగాల్లో సాధ్యమైనంత మేరకు సేవా కార్యక్రమాలను విస్తరించాలనే ఆలోచనతో ఫౌండేషన్ ముందుకు సాగుతోంది. సేవ చేయడానికి సిద్ధంగా ఉన్న ప్రతి ఒక్కరినీ కలుపుకుని మరింత పెద్ద సేవా కుటుంబంగా ఎదగాలన్నదే లక్ష్యం.

**-పదేళ్ల సేవకు ప్రజల ఆశీస్సులే గుర్తింపు**

హోప్ ఫౌండేషన్‌కు పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రజలు, దాతలు, సేవాభిమానులు, మిత్రులు, శ్రేయోభిలాషులు అందిస్తున్న అభినందనలు ఫౌండేషన్‌కు మరింత ఉత్సాహాన్ని ఇస్తున్నాయి. ప్రజల ఆశీస్సులు, ఆదరణ, నమ్మకమే తమకు అతి పెద్ద బహుమతి అని ఫౌండేషన్ నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు అందించిన సహకారాన్ని మించిన సహకారం భవిష్యత్తులో కూడా అందించాలని కోరుతున్నారు.

**-సేవా మార్గంలో మరిన్ని మైలురాళ్లు**

పది సంవత్సరాల ప్రయాణం ఎన్నో మైలురాళ్లను అందించింది. కానీ ముందున్న ప్రయాణం మరింత పెద్దది. మరో పది సంవత్సరాలు మాత్రమే కాదు... వీలైనన్ని సంవత్సరాలు నిరంతర సేవా కార్యక్రమాలను కొనసాగించాలనే సంకల్పం హోప్ ఫౌండేషన్‌లో ఉంది. సేవా కార్యక్రమాలకు వయస్సు ఉండదు. సేవకు విరామం ఉండకూడదు. అవసరం ఉన్నంతకాలం సేవ కొనసాగాలి. సమాజంలో ఆకలి, పేదరికం, ఆపద, అవసరం ఉన్నంతకాలం మానవత్వం ముందుకు రావాలి.

**-అదే హోప్ ఫౌండేషన్ లక్ష్యం.**

“సేవే మా బలం... మీ ఆశీస్సులే మా ప్రేరణ” హోప్ ఫౌండేషన్ పదేళ్ల సేవా ప్రయాణాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే ఎన్నో కార్యక్రమాలు కనిపిస్తాయి. ముందుకు చూస్తే మరెన్నో అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ప్రయాణంలో ఎక్కడైనా మంచి జరిగితే అది అందరి సహకారంతోనే. ఎక్కడైనా ఒక కుటుంబానికి అండగా నిలబడగలిగితే అది అందరి ఆశీస్సులతోనే. ఎక్కడైనా ఒక ఆకలితో ఉన్న వ్యక్తికి భోజనం అందించగలిగితే అది దాతల సహకారంతోనే. అందుకే హోప్ ఫౌండేషన్ తరఫున ఈ పదేళ్ల ప్రయాణంలో భాగమైన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.

**-కృతజ్ఞతలతో...**

భగవంతుని ఆశీస్సులు, కుటుంబ సభ్యుల ప్రేమ, దాతల సహకారం, సేవాభిమానుల ప్రోత్సాహం, స్వచ్ఛంద సేవకుల శ్రమ, ప్రజల ఆశీస్సులు లేకుండా ఈ పది సంవత్సరాల సేవా ప్రయాణం సాధ్యమయ్యేది కాదు, మా వెంట నడిచిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. మీరు ఇచ్చిన ప్రతి రూపాయి సహాయం,మీరు కేటాయించిన ప్రతి నిమిషం సమయం, మీరు చేసిన ప్రతి సేవ, మీరు అందించిన ప్రతి ప్రోత్సాహం, ంరు ఇచ్చిన ప్రతి ఆశీర్వాదం, హోప్ ఫౌండేషన్ సేవా ప్రయాణంలో చిరస్థాయిగా నిలిచిపోతాయి, మరో పది... మరెన్నో సంవత్సరాలు సేవా ప్రస్థానం, 2016 ఆగస్టు 10న ప్రారంభమైన హోప్ ఫౌండేషన్... 2026 ఆగస్టు 10 నాటికి పది సంవత్సరాల సేవా ప్రయాణాన్ని పూర్తి చేసుకుంది.ఇది ఒక గొప్ప మైలురాయి. కానీ ఇది అంతిమ గమ్యం కాదు. ముందు ఇంకా ఎన్నో సంవత్సరాల ప్రయాణం ఉంది. ముందు ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు ఉన్నాయి. ముందు ఇంకా ఎంతోమందికి అండగా నిలవాల్సి ఉంది. ముందు ఇంకా ఎన్నో జీవితాల్లో ఆశ నింపాల్సి ఉంది. అందుకే మీ అందరి ఆశీస్సులతో, భగవంతుని కృపతో, కుటుంబ సభ్యుల సహకారంతో, దాతలు మరియు సేవాభిమానుల అండతో హోప్ ఫౌండేషన్ మరింత ఉత్సాహంతో ముందుకు సాగాలని సంకల్పిస్తోంది. సేవా ప్రయాణం ఆగదు. మానవత్వం తగ్గదు. ఆశ చావదు,హోప్ ఫౌండేషన్ సేవ కొనసాగుతూనే ఉంటుంది, హోప్ ఫౌండేషన్ 10వ వార్షికోత్సవ సందర్భంగా, “సేవ చేయడానికి కారణం అవసరం లేదు, మనసుంటే చాలు, సహాయం చేయడానికి సంపద అవసరం లేదు, సాధ్యమైనంత చేయాలనే సంకల్పం ఉంటే చాలు, ఒకరి జీవితంలో ఆశ నింపడానికి పెద్ద పని చేయాల్సిన అవసరం లేదు, ఒక చిన్న సహాయం కూడా చాలాసార్లు పెద్ద మార్పుకు కారణమవుతుంది.”ఈ మానవతా స్ఫూర్తితోనే హోప్ ఫౌండేషన్ తన పదేళ్ల సేవా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది., రాబోయే రోజుల్లో కూడా ఇదే సేవా స్ఫూర్తితో మరింత ముందుకు సాగాలని, మరెన్నో కుటుంబాలకు అండగా నిలవాలని, మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షిస్తూ, హోప్ ఫౌండేషన్‌కు 10వ వార్షికోత్సవ శుభాకాంక్షలు, మీ ఆశీస్సులే మా బలం, మీ సహకారమే మా ప్రేరణ.,మానవ సేవే మా లక్ష్యంవీ, సమాజ సేవే మా సంకల్పం, హోప్ ఫౌండేషన్ సేవా ప్రస్థానం చిరకాలం కొనసాగాలని కోరుకుంటూ...

# బిజినెస్

# ఐటీఆర్ రిఫండ్ ఎప్పుడు వస్తుంది? ఆలస్యమైతే ఏం చేయాలి.. పూర్తి వివరాలివే

**ఐటీఆర్ రిఫండ్‌కు లేని నిర్దిష్ట గడువు**

**సాధారణంగా రెండు నుంచి ఆరు వారాల సమయం**

**ఈ-వెరిఫికేషన్ వెంటనే పూర్తి చేయాలి**

**ఫామ్ 26ఏఎస్, ఏఐఎస్, టీఐఎస్ వివరాలు సరిపోలాలి**

**బ్యాంకు ఖాతా ప్రీ-వాలిడేట్ చేసి ఉండాలి**

**ఆలస్యమైతే ఈ-ఫైలింగ్ పోర్టల్‌లో స్టేటస్ చూడాలి**




ఆదాయపు పన్ను రిటర్న్ (ఐటీఆర్) దాఖలు చేశారా? అయితే రిఫండ్ ఎప్పుడు ఖాతాలో పడుతుందా అని ఎదురుచూస్తుంటారు. అయితే రిఫండ్ జమ కావడానికి ఆదాయపు పన్ను శాఖ నిర్దిష్ట గడువు ఏదీ విధించలేదు. ఆర్థిక నిపుణుల ప్రకారం.. ఐటీఆర్‌లో ఎలాంటి తప్పులు లేకుండా దాఖలు చేసి, వెంటనే ఈ-వెరిఫికేషన్ పూర్తి చేస్తే సాధారణంగా రెండు నుంచి ఆరు వారాల్లో రిఫండ్ అందే అవకాశం ఉంది. రిఫండ్ త్వరగా రావాలంటే ఐటీఆర్‌లో ఇచ్చిన వివరాలు సరిగ్గా ఉండటం చాలా ముఖ్యం. ఆదాయం, టీడీఎస్ వివరాలు ఫామ్ 26ఏఎస్, ఏఐఎస్, టీఐఎస్‌తో సరిపోలాలి. బ్యాంకు ఖాతాను ముందుగానే ప్రీ-వాలిడేట్ చేసి ఉండాలి. రిటర్న్ దాఖలు చేసిన వెంటనే ఈ-వెరిఫికేషన్ పూర్తి చేయడం కూడా కీలకమే. వివరాల్లో చిన్న తేడా ఉన్నా అదనపు పరిశీలనకు వెళ్లే అవకాశం ఉంది. దీంతో రిఫండ్ ఆలస్యం కావచ్చు. ఐటీఆర్‌ను గడువు కంటే ముందే దాఖలు చేస్తే రిఫండ్ త్వరగా వస్తుందన్న హామీ ఏమీ ఉండదు. అయితే రిటర్న్ ప్రాసెసింగ్ క్యూలో ముందుగా చేరే అవకాశం ఉంటుంది. ఏదైనా తప్పు తేలితే దాన్ని సరిచేసుకునేందుకు కూడా ఎక్కువ సమయం దొరుకుతుంది. రిఫండ్ ఇంకా రాకపోతే ముందుగా ఆదాయపు పన్ను ఈ-ఫైలింగ్ పోర్టల్‌లో రిటర్న్, రిఫండ్ స్టేటస్ చెక్ చేయాలి. బ్యాంకు ఖాతా ప్రీ-వాలిడేట్ అయిందో.. లేదో.. పరిశీలించాలి. ఆ ఖాతాకు పాన్ అనుసంధానం ఉందో కూడా చూడాలి. ఆదాయపు పన్ను శాఖ నుంచి ఏదైనా నోటీసు లేదా సమాచారం వచ్చిందా అనేది చెక్ చేసి, అవసరమైతే వెంటనే స్పందించాలి. అన్నీ సరిగ్గా ఉన్నా రిఫండ్ పెండింగ్‌లో ఉంటే అధికారిక పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. రిఫండ్ ఆలస్యమైన కొన్ని సందర్భాల్లో వడ్డీ కూడా లభిస్తుంది. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 244ఏ కింద అర్హత ఉన్న రిఫండ్‌లకు వడ్డీ చెల్లించే నిబంధన ఉంది. నిబంధనలకు లోబడి సాధారణంగా నెలకు 0.5 శాతం చొప్పున సాధారణ వడ్డీ లభించే అవకాశం ఉంటుంది.

# క్రీడలు

# ఐసీసీపై మండిపడుతున్న చిన్న జట్లు.. అసలేమిటీ వరల్డ్ కప్ ఫార్మాట్ వివాదం?

**పురుషుల వన్డే ప్రపంచకప్ క్వాలిఫికేషన్ ఫార్మాట్‌లో మార్పులు**

**ఐసీసీ నిర్ణయంపై స్కాట్లాండ్, నెదర్లాండ్స్ బోర్డుల తీవ్ర అసంతృప్తి**

**చిన్న జట్లకు అవకాశాలు తగ్గించేలా కొత్త నిబంధనలు ఉన్నాయని ఆరోపణ**

**కనీస సమాచారం లేకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని విమర్శ**

**నిర్ణయంపై పునరాలోచించాలని ఐసీసీని కోరిన అసోసియేట్ దేశాలు**



అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తీసుకున్న ఒక అనూహ్య నిర్ణయం క్రికెట్ ప్రపంచంలో తీవ్ర దుమారం రేపుతోంది. పురుషుల వన్డే ప్రపంచకప్ క్వాలిఫికేషన్ ప్రక్రియలో, టోర్నమెంట్ ఫార్మాట్‌లో ఆకస్మికంగా మార్పులు చేయడంపై స్కాట్లాండ్, నెదర్లాండ్స్ క్రికెట్ బోర్డులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇది అసోసియేట్ దేశాల (చిన్న జట్లు) క్రికెట్ అభివృద్ధికి పెద్ద దెబ్బ అని, ప్రపంచవ్యాప్తంగా ఆటను విస్తరించే ప్రయత్నాలకు ఇది గొడ్డలిపెట్టు అని హెచ్చరించాయి.

**ఏమిటీ కొత్త మార్పులు?**

గత జులైలో ఎడిన్‌బర్గ్‌లో జరిగిన ఐసీసీ వార్షిక సమావేశం తర్వాత ఈ మార్పులను ప్రకటించారు. వాస్తవానికి, ఈ టోర్నమెంట్‌లో 14 జట్లు పాల్గొనాలి. వాటిని ఏడేసి జట్లుగా రెండు గ్రూపులుగా విభజించి, ఆ తర్వాత 'సూపర్ సిక్స్' దశ నిర్వహించాల్సి ఉంది. కానీ, ఐసీసీ ఇప్పుడు 'సూపర్ సిరీస్', 'సూపర్ 7' అనే కొత్త దశలను ప్రవేశపెట్టింది. ఈ కొత్త విధానం ప్రకారం, క్వాలిఫయింగ్ రౌండ్‌లో చివరి మూడు స్థానాల్లో (12, 13, 14) నిలిచిన జట్లు మొదట 'సూపర్ సిరీస్' ఆడతాయి. ఇందులో గెలిచిన ఒక్క జట్టు మాత్రమే తర్వాతి దశకు అర్హత సాధిస్తుంది. ఆ తర్వాత, టాప్ 11 జట్లతో కలిసి మొత్తం 12 జట్లను ఆరేసి చొప్పున రెండు గ్రూపులుగా విభజిస్తారు. ప్రతి గ్రూప్ నుంచి టాప్ 3 జట్లతో పాటు, ఆ తర్వాత ఉత్తమ ప్రదర్శన కనబరిచిన మరో జట్టుతో కలిపి మొత్తం ఏడు జట్లు 'సూపర్ 7' దశలో ఆడతాయి. ఈ ఏడు జట్ల మధ్య జరిగే రౌండ్ రాబిన్ మ్యాచ్‌ల ఆధారంగా సెమీ ఫైనలిస్టులను నిర్ణయిస్తారు.

**చిన్న జట్లకు నష్టమా?**

ఈ మార్పుల వల్ల అసోసియేట్ దేశాలు తీవ్రంగా నష్టపోతాయని స్కాట్లాండ్, నెదర్లాండ్స్ బోర్డులు ఆందోళన వ్యక్తం చేశాయి. టోర్నమెంట్ ప్రారంభానికి కేవలం 18 నెలల ముందు ఇలాంటి కీలక మార్పులు చేయడం దారుణమని సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి. ముఖ్యంగా పరిమిత వనరులతో నడిచే చిన్న దేశాలపై ఇది పెను భారం మోపుతుంది. ఏళ్ల తరబడి ఒకే క్వాలిఫికేషన్ విధానం ఉంటుందని నమ్మి, అందుకు అనుగుణంగా ప్రణాళికలు, శిక్షణ, ఆర్థిక ఏర్పాట్లు చేసుకున్న జట్లకు ఈ ఆకస్మిక మార్పులు కోలుకోలేని దెబ్బ. వారి ప్రణాళికలన్నీ తలకిందులవుతాయి. కొత్త ఫార్మాట్‌కు అలవాటుపడటానికి, వ్యూహాలు మార్చుకోవడానికి సమయం ఉండదు. ఇది వారిపై అదనపు ఆర్థిక, నిర్వహణ ఒత్తిడిని పెంచుతుంది. ప్రపంచకప్‌లో ఆడే అవకాశం వస్తేనే స్పాన్సర్లు, ప్రభుత్వాల నుంచి నిధులు, యువ ఆటగాళ్లలో స్ఫూర్తి వస్తాయి. కానీ, అర్హత సాధించే మార్గాన్ని ఇంత కఠినతరం చేస్తే, ఆ దేశాల్లో క్రికెట్ అభివృద్ధి కుంటుపడుతుంది.

**ఐసీసీ తీరుపై తీవ్ర విమర్శలు**

"క్రికెట్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలని చెబుతూనే, వర్ధమాన దేశాలకు అవకాశాలు తగ్గించడం తప్పుడు సంకేతాలు పంపుతుంది. కనీసం మాతో చర్చించకుండా, మా అభిప్రాయాలు తీసుకోకుండా ఇంత పెద్ద నిర్ణయం ఎలా తీసుకుంటారు?" అని బోర్డులు ప్రశ్నించాయి. ఈ నిర్ణయాల వెనుక పారదర్శకత లోపించిందని, ఇది అంతర్జాతీయ క్రికెట్ సమగ్రతను దెబ్బతీస్తుందని ఆరోపించాయి. ఈ మార్పుల గురించి ఎడిన్‌బర్గ్ సమావేశంలో తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, ఇది తమకు పిడుగుపాటులాంటి వార్త అని ఓ అసోసియేట్ దేశ అధికారి తెలిపారు. మార్పుల ప్రకటన తర్వాత ఐసీసీతో రెండుసార్లు సమావేశమైనా, లిఖితపూర్వకంగా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని, రెండు వారాలుగా ఐసీసీ నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం నిరాశపరిచిందని, ఇది తమను అగౌరవపరచడమేనని ఆవేదన వ్యక్తం చేశాయి. గతంలో అసోసియేట్ దేశాలు పెద్ద జట్లను ఓడించి సృష్టించిన సంచలనాలు టోర్నమెంట్‌కే వన్నె తెచ్చాయని గుర్తుచేశాయి. ఆటలో ప్రతిభే గెలవాలనే సూత్రానికి ఈ మార్పులు విరుద్ధమని పేర్కొన్నాయి. ఐసీసీ వెంటనే ఈ విషయంపై అసోసియేట్ సభ్యులతో చర్చలు జరిపి, ప్రపంచ క్రికెట్ ప్రయోజనాలను కాపాడాలని ఆ బోర్డులు డిమాండ్ చేశాయి.

## ఇప్పటికీ నేనే పాకిస్థాన్ కెప్టెన్.. కానీ గ్యారెంటీ లేదు: షహీన్ అఫ్రిది



పాకిస్థాన్ వన్డే కెప్టెన్‌గా ఇప్పటికీ తానే ఉన్నానన్న షహీన్ షా అఫ్రిది బాబర్ అజామ్‌ను అన్ని ఫార్మాట్లకు కెప్టెన్‌గా నియమిస్తారనే వార్తలు టెస్ట్ కెప్టెన్సీతో పాటు ఇతర ఫార్మాట్ల పగ్గాలు కావాలని బాబర్ షరతు వచ్చే ప్రపంచకప్ వరకు షహీన్ ఉంటాడా లేదా అనేదానిపై అనిశ్చితి గతంలో పేలవ ఫలితాల కారణంగా కెప్టెన్లను మార్చిన పాకిస్థాన్ బోర్డు పాకిస్థాన్ క్రికెట్‌లో కెప్టెన్సీ మార్పుల పర్వం కొనసాగుతోంది. పేలవ ఫలితాల కారణంగా జాతీయ జట్టులో నాయకత్వ ప్రక్షాళన జరుగుతున్న వేళ, తన వన్డే కెప్టెన్సీపై వస్తున్న ఊహాగానాలపై పేసర్ షహీన్ షా అఫ్రిది స్పందించాడు. "ప్రస్తుతానికి పాకిస్థాన్ వన్డే జట్టుకు నేనే కెప్టెన్" అని అతడు స్పష్టం చేశాడు. అయితే, అన్ని ఫార్మాట్లకు బాబర్ అజామ్‌ను తిరిగి కెప్టెన్‌గా నియమించే అవకాశాలున్నాయని వస్తున్న వార్తల నేపథ్యంలో షహీన్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. 'టెలికామ్ ఆసియా స్పోర్ట్' కథనం ప్రకారం, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మాజీ కెప్టెన్ బాబర్ అజామ్‌కు మూడు ఫార్మాట్లలోనూ నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే అతడికి టెస్ట్ జట్టు పగ్గాలు అప్పగించగా, త్వరలోనే వన్డే జట్టు కెప్టెన్సీని కూడా అప్పగించే అంశాన్ని పీసీబీ పరిశీలిస్తోంది. వైట్-బాల్ హెడ్ కోచ్ మైక్ హెస్సన్, సెలెక్టర్ అకిబ్ జావేద్‌ల మద్దతు మీకు ఉందా అని విలేకరులు ప్రశ్నించగా, షహీన్ ఓ చిరునవ్వు నవ్వి, "ఇప్పటికైతే నేనే కెప్టెన్" అని సమాధానమిచ్చాడు. కొన్ని రోజుల క్రితం, టెస్ట్ కెప్టెన్సీని అంగీకరించిన బాబర్.. తనకు అన్ని ఫార్మాట్లలోనూ నాయకత్వం ఇవ్వాలనే షరతు విధించినట్లు వార్తలు వచ్చాయి. వెస్టిండీస్‌తో రెండు టెస్టులు, ఇంగ్లండ్‌తో మూడు టెస్టుల సిరీస్‌లో మంచి ఫలితాలు సాధిస్తే, అతడిని పూర్తిస్థాయి కెప్టెన్‌గా నియమిస్తామని ఇద్దరు సెలెక్టర్లు హామీ ఇచ్చినట్లు సమాచారం. గత ఏడాది అక్టోబర్‌లో షహీన్‌ను వన్డే కెప్టెన్‌గా నియమించారు. మహమ్మద్ రిజ్వాన్ నాయకత్వంలో ఛాంపియన్స్ ట్రోఫీ మొదటి రౌండ్‌లోనే పాక్ నిష్క్రమించడం, 24 ఏళ్ల తర్వాత వెస్టిండీస్ చేతిలో సిరీస్ ఓడిపోవడంతో అతడి స్థానంలో షహీన్‌కు పగ్గాలు అప్పగించారు. గత ఐదేళ్లలో లాహోర్ ఖలందర్స్‌ను మూడుసార్లు పీఎస్ఎల్ ఛాంపియన్‌గా నిలబెట్టిన షహీన్‌పై భారీ అంచనాలున్నాయి. వచ్చే ఏడాది ఆఫ్రికాలో జరిగే వన్డే ప్రపంచకప్ వరకు అతడే కెప్టెన్‌గా కొనసాగుతాడని భావిస్తున్నప్పటికీ, పాక్ క్రికెట్‌లో తరచూ జరిగే మార్పుల దృష్ట్యా దీనిపై ఎలాంటి గ్యారెంటీ లేదు. బాబర్ అజామ్‌కు కూడా టెస్ట్ కెప్టెన్‌గా సుదీర్ఘకాలం పదవి ఇవ్వలేదు. కేవలం వెస్టిండీస్, ఇంగ్లండ్ పర్యటనలకు మాత్రమే అతడిని కెప్టెన్‌గా నియమించారు. ఈ నేపథ్యంలో, వచ్చే ప్రపంచకప్‌లో బాబర్ అజమే పాకిస్థాన్ కెప్టెన్‌గా ఉంటాడని మాజీ బ్యాటర్ బాసిత్ అలీ ఇటీవల జోస్యం చెప్పాడు. ప్రపంచకప్ సన్నాహకాల్లో భాగంగా పాకిస్థాన్ బిజీ షెడ్యూల్‌ను కలిగి ఉంది. స్వదేశంలో శ్రీలంక, ఇంగ్లండ్‌తో ట్రై-సిరీస్, ఆ తర్వాత జింబాబ్వే, ఐర్లాండ్‌తో మరో ట్రై-సిరీస్, ఇంగ్లండ్‌లో ఐదు మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌లలో ప్రదర్శన ఆధారంగానే కెప్టెన్సీ భవితవ్యం తేలనుంది.

# ముందు కాల్చి, తర్వాతే మాట్లాడతాం

## 'స్లమ్‌డాగ్' నుంచి టబు పవర్‌ఫుల్ గ్లింప్స్!

స్టార్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్, ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో వస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్లమ్‌డాగ్ – 33 టెంపుల్ రోడ్'. ఈ సినిమాపై మొదటి నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి, కీలక పాత్ర పోషిస్తున్న సీనియర్ నటి టబు క్యారెక్టర్ గ్లింప్స్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ వీడియో సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ఈ సినిమాలో టబు 'గౌరీ హెగ్డే' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. గ్లింప్స్ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. "భయంలేని, శక్తివంతమైన, ధైర్యవంతురాలు. భారతీయ సినిమా రత్నం టబును గౌరీ హెగ్డేగా పరిచయం చేస్తున్నాం" అని పూరీ జగన్నాథ్ పేర్కొన్నారు. విడుదలైన వీడియోలో టబు తన పాత్రలో ఒదిగిపోయారు. కొందరిని కొడుతూ, బెదిరిస్తూ పవర్‌ఫుల్ ఆఫీసర్‌గా కనిపించారు. "మా స్టైల్‌లో మేము ముందు కాల్చి, ఆ తర్వాత మాట్లాడతాం" అంటూ విజయ్ సేతుపతికి ఆమె చెప్పే డైలాగ్ గ్లింప్స్‌కే హైలైట్‌గా నిలిచింది. చివర్లో "గౌరీ హెగ్డే – డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్" అని ఆమె తన హోదాను వెల్లడించడం ఆకట్టుకుంది. గతేడాది జులైలో ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని చిత్ర వర్గాలు తెలిపాయి. గతంలో విడుదల చేసిన టైటిల్ పోస్టర్‌లో విజయ్ సేతుపతి చేతిలో కత్తి, చుట్టూ డబ్బు కట్టలతో కనిపించి సినిమాపై క్యూరియాసిటీ పెంచారు. ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్.. జేబీ మోషన్ పిక్చర్స్‌తో కలిసి జేబీ నారాయణరావు కొండ్రొళ్ల నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో విజయ్ సేతుపతి సరసన సంయుక్త హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ స్టార్ దునియా విజయ్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. బ్రహ్మాజీ, వీటీవీ గణేష్ వంటి నటులు ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించను న్నారు. 'అర్జున్ రెడ్డి' (నేపథ్య సంగీతం), 'యానిమల్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలకు సంగీతం అందించిన హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.




## కొడుక్కి రామ్ చరణ్ పేరు.. అభిమాని ప్రేమకు ఫిదా

## ఇంటికి పిలిచిన చిరంజీవి!

మెగాస్టార్ చిరంజీవి తన అభిమానులను సొంత కుటుంబ సభ్యుల్లా చూస్తారనడానికి మరో సంఘటన నిదర్శనంగా నిలిచింది. ఓ సాధారణ టెక్నీషియన్ చూపిన అభిమానానికి ముగ్ధుడై, అతడి కుటుంబాన్ని ఇంటికి ప్రత్యేకంగా ఆహ్వానించి ఆశ్చర్యపరిచారు. ఈ ఆత్మీయ భేటీలో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కూడా పాల్గొనడం విశేషం. ఈ హృద్యమైన ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. ప్రస్తుతం చిరంజీవి 'మెగా 158' సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ చిత్రానికి కెమెరా విభాగంలో పనిచేస్తున్న నివాస్ అనే టెక్నీషియన్‌ను చిరంజీవి పలకరించారు. మాటల సందర్భంలో నివాస్ తాను రామ్ చరణ్‌కు వీరాభిమానినని, ఆ అభిమానంతోనే తన కుమారుడికి 'జస్వంత్ రామ్ చరణ్' అని పేరు పెట్టుకున్నానని చిరంజీవితో చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న మెగాస్టార్ ఎంతో సంతోషించి, భావోద్వేగానికి గురయ్యారు. వెంటనే నివాస్‌ను తన కుటుంబంతో సహా ఇంటికి రావాలని ప్రేమగా ఆహ్వానించారు. మెగాస్టార్ పిలుపుతో ఆనందంలో మునిగిపోయిన నివాస్, తన కుటుంబంతో కలిసి ఆయన నివాసానికి వెళ్లారు. అక్కడ వారికి మరో సర్‌ప్రైజ్ ఎదురైంది. చిరంజీవితో పాటు రామ్ చరణ్ కూడా వారిని ఆప్యాయంగా పలకరించి, వారితో సమయం గడిపారు. ముఖ్యంగా చిన్నారి జస్వంత్ రామ్ చరణ్‌తో చరణ్ కాసేపు సరదాగా గడిపారు. అనంతరం నివాస్ కుటుంబంతో కలిసి చిరు, చరణ్ ఫొటోలు దిగారు. ఈ అరుదైన క్షణాలకు సంబంధించిన ఫొటోలు బయటకు రావడంతో మెగా అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ హీరోల గొప్ప మనసును ప్రశంసిస్తూ కామెంట్లు పెడుతున్నారు. ఓ సాధారణ అభిమానికి మెగా ఫ్యామిలీ ఇచ్చిన గౌరవం, వారి మధ్య ఉన్న బంధానికి నిదర్శనమని అంటున్నారు.



## రవితేజ 'ఇరుముడి'

## ట్రైలర్ రిలీజ్ పై స్పెషల్ పోస్టర్

మాస్ మహారాజా రవితేజ, విజయవంతమైన దర్శకుడు శివ నిర్వాణ కాంబినేషన్‌లో వస్తున్న కొత్త చిత్రం 'ఇరుముడి'. ఈ సినిమా ట్రైలర్ ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో, ఈ చిత్రబృందం ప్రమోషన్ల స్పీడు పెంచింది.ఈ క్రమంలో, అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఇరుముడి' థియేట్రికల్ ట్రైలర్ ను ఆగస్టు 12న విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో భారీ స్థాయిలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించబోతున్నారు. భీమవరంలోని ఎస్ఆర్కేఆర్ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఆ రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఈ కార్యక్రమం జరగనుంది. ఈ మేరకు చిత్ర యూనిట్ ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. "తన కుటుంబాన్ని కాపాడేందుకు ఓ వ్యక్తి విశ్వాసాన్నే తన అతిపెద్ద ఆయుధంగా మార్చుకుని చేసే ప్రయాణమే ఈ సినిమా" అంటూ విడుదల చేసిన ట్యాగ్‌లైన్, 'ఇరుముడి' అనే టైటిల్ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. భక్తి, కుటుంబ భావోద్వేగాల కలబోతగా ఈ సినిమా ఉండబోతున్నట్టు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని ప్రఖ్యాత నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్‌తో కలిసి నిర్మిస్తోంది. ఇందులో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సాయికుమార్, బేబీ నక్షత్ర కీలక పాత్రలు పోషిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాపై అభిమానుల్లో, సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి.




## కిరణ్ అబ్బవరం 'ఇంద్రపుత్ర'

## పాన్ ఇండియా స్థాయిలో భారీ మైథలాజికల్ చిత్రం




వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న యువ హీరో కిరణ్ అబ్బవరం తన కెరీర్‌ను మరో స్థాయికి తీసుకెళుతున్నారు. ప్రాంతీయ చిత్రాల పరిధిని దాటి పాన్ ఇండియా స్థాయిలో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. ఆయన కథానాయకుడిగా 'ఇంద్రపుత్ర' అనే భారీ మైథలాజికల్ యాక్షన్ ఫాంటసీ చిత్రాన్ని సోమవారం అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇది కిరణ్ కు 15వ చిత్రం.ప్రముఖ నిర్మాణ సంస్థ జీ స్టూడియోస్, గతంలో సుధీర్ బాబుతో 'జటాధార' నిర్మించిన ప్రేరణ అరోరా ఈ చిత్రాన్ని సంయుక్త ంగా నిర్మిస్తున్నాయి. శ్రీకాంత్ పుప్పాల ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు దర్శకత్వం వహించను న్నారు. ధర్మానికి, అధర్మానికి మధ్య జరిగే యుద్ధం నేపథ్యంలో రాబోయే ఒక సినిమాటిక్ యూనివర్స్‌లో ఇది తొలి భాగంగా ఉంటుందని చిత్రబృందం తెలిపింది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కను న్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ 2026 అక్టోబరులో ప్రారంభం కానుంది. 2027లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.కెరీర్ ఆరంభంలో కొన్ని పరాజయాలు, సోషల్ మీడియాలో ట్రోలింగ్ ఎదుర్కొన్న కిరణ్ అబ్బవరం, ఇటీవల కాలంలో బలంగా పుంజుకున్నారు. 'కా', 'కే రాంప్', 'చెన్నై లవ్ స్టోరీ' వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించి ఆయనకు మంచి మార్కెట్‌ను అందించాయి. ఈ విజయాలతో వచ్చిన ఆత్మవిశ్వాసంతోనే ఆయన ఇప్పుడు పాన్ ఇండియా ప్రాజెక్టులపై దృష్టి సారించారు.ప్రస్తుతం కిరణ్ చేతిలో పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులు ఉన్నాయి. తన 13వ చిత్రంగా 'రియాలిటీ' అనే సినిమాను స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. జాయ్ ఫిల్మ్స్ పతాకంపై సుధాకర్ చాగంటి నిర్మిస్తున్న ఈ చిత్రంతో కన్నడ నటి దేవిక భట్ పరిచయమవుతున్నారు. ఈ సినిమాను 2026 డిసెంబరులో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. దీనితో పాటు సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌పై వీర కొగటం దర్శకత్వంలో ఓ క్రైమ్ థ్రిల్లర్‌లో కూడా కిరణ్ నటిస్తున్నారు. వరుస చిత్రాలతో బిజీగా ఉంటూనే, 'ఇంద్రపుత్ర' వంటి భారీ చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో తనదైన ముద్ర వేయాలని కిరణ్ అబ్బవరం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.



Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449